www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 20 డిసెంబర్ 2022



ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

కడప : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 23, 24, 25 తేదీలలో మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని కలెక్టర్ విజయ్‌రామరాజు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ వీసి హాలులో రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై ఎస్‌పి అన్బురాజన్, జేసీ సీ.ఎం.సాయికాంత్ వర్మ, డిఆర్వో గంగాధర్ గౌడ్ లతో కలిసి జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలో భాగంగా ఈ నెల 23న కమలాపురం, ఇడుపులపాయ, 24, 25 రెండు రోజులు పులివెందులలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా అధికారులకు వివిధ బాధ్యతలను అప్పగించామని చెప్పారు.

స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీలో గోల్‌మాల్

- ఒకే నోటిఫికేషన్ కిందే ఎఆర్‌టి, యుపిహెచ్‌సి పోస్టుల భర్తీ!
- 25 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీపై గందరగోళం
- ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌పై ఫిర్యాదు

జిల్లాలో స్టాఫ్‌నర్సు పోస్టుల రిక్రూట్‌మెంట్ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఎపి శాక్స్) నోటిఫికేషన్ కింద ఎఆర్‌టి, ఇతర మాధ్యమంలో యుపిహెచ్‌సి విభాగాల కింద వేర్వేరుగా చేపట్టిన 25 స్టాఫ్‌నర్సుల నియామకాలపై గందరగోళం చోటుచేసుకుంది. ఒకే నోటిఫికేషన్, ఒకే రోస్టర్ కింద రెండు విభాగాల పరిధిలోని స్టాఫ్‌నర్సుల పోస్టులను ఎలా భర్తీ చేస్తారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ వర్తించని నోటిఫికేషన్‌కు వచ్చిన వందలాది దరఖాస్తులను ఒకే రోస్టర్ మెరిట్ ఆధారంగా యుపిహెచ్‌సి స్టాఫ్‌నర్సు పోస్టులను ఎలా భర్తీ చేస్తారని, వాటిని రద్దు చేసి మళ్లీ నోటిఫికేషన్ జారీ చేయాలనే వాదన పెద్దఎత్తున వినిపిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఎపి శాక్స్) నోటిఫికేషన్ ఆధ్వర్యంలో స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది ఆగస్టులో ఎపిశాక్స్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రూ.21 వేల వేతనంతో ఐదు ఎఆర్‌టి (ఆంటీ రిట్రోవైరల్ థెరఫీ) స్టాఫ్‌నర్సుల పోస్టులకు 270 స్టాఫ్‌నర్సు పోస్టులకు దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి ఇడబ్ల్యుస్ రిజర్వేషన్ వర్తించదని నోటిఫికేషన్ స్పష్టం చేసినట్లు సమాచారం. నవంబర్ 12న డిఎంహెచ్ఒ, అడిషనల్ డిఎంహెచ్ఒలతో కూడిన రిక్రూట్‌మెంట్ కమిటీ ఐదు స్టాఫ్‌నర్స్, ఆరు ల్యాబ్ టెక్నీషియన్స్, నలుగురు కౌన్సిలర్లు, ఒక్కొక్కరు చొప్పున ఫార్మ సిస్ట్, మెడికల్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసింది. ఇందులోని ఐదుగురు స్టాఫ్‌నర్సుల పోస్టులకు ముగ్గురు మాత్రమే ఎంపికయ్యారు. మిగిలిన రెండు పోస్టుల భర్తీ నిమిత్తం మరోసారి నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. మొదటి, రెండవ దఫా నోటిఫికేషన్ కింద రిక్రూటైన ఐదుగురు ఎఆర్‌టి స్టాఫ్‌నర్సులను ఉమ్మడి కడప జిల్లాలోని రిమ్స్, ప్రొద్దుటూరు, రాయచోటి, రాజంపేట, పులివెందుల ఎఆర్‌టి సెంటర్లలో నియమించారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ (యుపిహెచ్‌సి) కింద 20 మంది స్టాఫ్ నర్సులను నియమించాలని ఆదేశాలు అందడంతో నోటిఫికేషన్ విడుదల చేయాల్సి వచ్చింది. జిల్లా వైద్యఆరోగ్య శాఖ రెండవ కేటగిరీ కింద యుపిహెచ్‌సి స్టాఫ్‌నర్సుల



రిక్రూట్‌మెంట్ నిమిత్తం నోటిఫికేషన్ జారీ చేయాల్సిన నేపథ్యంలో డిసెంబర్ 16న గుర్తు తెలియని మీడియా మాధ్యమంలో నోటిఫికేషన్ ఇచ్చినట్లు సమాచారం. యుపిహెచ్‌సి నోటిఫికేషన్ సమాచారం తెలియకపోవడంతో నిరుద్యోగులకు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. దీన్ని అవకాశంగా తీసుకున్న రిక్రూట్‌మెంట్ కమిటీ ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ వర్తించని ఎపిశాక్స్ నోటిఫికేషన్ కింద వచ్చిన 270 పైగా దరఖాస్తుల్లో ఎఆర్‌టి కేటగిరీ కింద భర్తీ చేసిన ఐదు పోస్టులు దక్కించుకున్న దరఖాస్తులను మినహాయించి మిగిలిన దరఖాస్తులతో రిక్రూట్‌మెంట్ కథ నడిపించారనే విమర్శలు పెద్దఎత్తున ఉన్నాయి. యుపిహెచ్‌సి కేటగిరీ కింద రూ.24 వేల వేతన ప్రాతిపదికన 20 స్టాఫ్‌నర్సుల పోస్టుల ఎంపిక అత్యవసరమైతే గతంలో యుపిహెచ్‌సి కింద సీనియారిటీ జాబితా ప్రకారమైనా చేయాలి. లేనిపక్షంలో ప్రస్తుత పోటీ వాతావరణంలో అందరికీ తెలిసేలా కొత్త నోటిఫికేషన్ విడుదల చేసి స్టాఫ్‌నర్సు పోస్టులను రిక్రూట్‌మెంట్ చేయాల్సి ఉందనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి విధానాలను ఉద్దేశపూర్వకంగా విస్మరించి ఇడబ్ల్యుఎస్ వర్తించని ఎపి శాక్స్ నోటిఫికేషన్ దరఖాస్తుల ఆధారంగా రిక్రూట్‌మెంట్ చేయడం ఏమిటనే విమర్శలు వ్యక్తమవు తున్నాయి. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ వివరాలు ప్రకటించని కారణంగా తాము ఉద్యోగావకాశాన్ని కోల్పోయామని పలువురు వాపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. అత్యవసర ప్రాతిపదికన స్టాఫ్‌నర్సు పోస్టులను రిక్రూట్‌మెంట్ చేయాల్సి వస్తే యుపిహెచ్‌సి పాత రోస్టర్ మెరిట్ జాబితా ఆధారంగా రిక్రూట్‌మెంట్ చేయాల్సి ఉందని, గుర్తుతెలియని మీడియా మాధ్యమంలో నోటిఫికేషన్ విడుదల చేసి గుట్టు చప్పుడు గాకుండా ఎపిశాక్స్ నోటిఫికేషన్ దరఖాస్తుల ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన అర్బన్ సెంటర్స్ స్టాఫ్‌నర్సులను ఎంపిక చేయ డంలోని మతలబేమిటో తేల్చాలని, వివాదాస్పద రిక్రూట్‌మెంట్ కమిటీ సభ్యులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై డిఎంహెచ్ఒను వివరణ కోరడానికి ప్రయత్నించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

26 లోపు ఓటర్ల సవరణ జాబితా సిద్ధం చేయాలి

భారత ఎన్నికల కమిషన్ రోల్ అబ్జర్వర్ పి.ఎస్.ప్రద్యుమ్న

ప్రజాశక్తి - కడప

ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా – 2023ను ఎలాంటి పెండింగ్ లేకుండా సిద్ధం చేయాలని భారత ఎన్నికల కమిషన్ రోల్ అబ్జర్వర్ పి.ఎస్. ప్రద్యుమ్న అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో భారత ఎన్నికల కమిషన్ రోల్ అబ్జర్వర్ పి.ఎస్. ప్రద్యుమ్న జేసీ సాయికాంత్ వర్మ, శిక్షణా కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ అమలుపై జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇఆర్ఒలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోల్ అబ్జర్వర్ ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా పురోగతిని జిల్లాలో నియోజకవర్గాల వారీగా అడిగి తెలుసుకున్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2023వ సంవత్సరం జనవరి 5న తుది ఎన్నికల జాబితా ప్రచురణ నేపథ్యంలో ఈ నెల 26 నాటికి జిల్లా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితాను సిద్ధం చేయాలన్నారు. అందుకు సంబంధించిన కార్యాచరణపై జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఇఆర్ఒలు, ఎఇ ఆర్ఒలకు దిశానిర్దేశం చేశారు. ఈ విషయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహిం చాల న్నారు. జిల్లాల్లో కొత్తగా ఓటు నమోదు కోసం ఫారమ్–6, నకిలీ ఓటర్లు, ఇతర ప్రదేశాలకు వలస పోయిన వారు, మరణించిన వారు, కొత్తగా వివాహం అయ్యి వేరే ఊళ్లకు వెళ్లిన వారు, పునరావృతం అయిన పేర్లు వంటి తొలగింపునకు ఫారమ్–7, మార్పుల కోసం ఫారమ్–8 లను ఉపయోగిస్తూ జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఫారమ్–6బి ద్వారా ఓటరు కార్డును ఆధార్ కార్డుతో అనుసం ధానం చేయాలన్నారు. అలాగే పోలింగ్ స్టేషన్ల మార్పు మొదలైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కొత్తగా ఓటు నమోదుకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా 18–19 వయస్సులో ఉన్న వారు, ట్రాన్స్ జెండర్లు, నిరాశ్రయుల జాబితాను తయారీలోను ప్రత్యేక దృష్టి సారించాలని సంబందిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జేసీ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధి విధానాల మేరకు జిల్లాలో అన్ని కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నామని, రానున్న ఎన్నికలకు సంబంధించి చేపడుతున్న నిర్వహణ ఏర్పాట్ల పురోగతిని రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించారు. నిర్దేశిత లక్ష్యం మేరకు జిల్లాలో అన్ని పనులను పూర్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో డిఆర్వో గంగాధర్ గౌడ్, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీఓలు ధర్మాచంద్రా రెడ్డి, శ్రీనివాసులు, వెంకట రమణ, వెంక టేశ్వర్లు, ఎన్నికల నోడల్ అధికారి శివారెడ్డి, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు బాలకృష్ణ యాదవ్ , సతీష్ చంద్ర, చంద్ర శేఖర్ రెడ్డి, బి. నారాయణ , డా. బి. వర కుమార్ , హరిప్రసాద్, నీలి శ్రీనివాసరావు కాంగ్రెస్, సీపీఐ తదితర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రోల్ అబ్జర్వర్ ప్రద్యుమ్న

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



డిఆర్ఒకు వినతిపత్రం అందజేస్తున్న దస్తగిరిరెడ్డి

జిల్లాలో మాండూస్ తుపానుతో నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని సోమవారం కలెక్టరేట్ స్పందనలో డిఆర్ ఒకు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పత్తి, పప్పుశనగ, కంది జొన్న వరి, పంటలు దెబ్బతిన్నాయని ఆర్‌బికె అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయడంలో నిర్లక్ష్యంగా ఉన్నారని తెలిపారు. పెండ్లిమర్రి మండలంలో పప్పుశనగ పూల తోటలు, పత్తి దెబ్బ తిన్నాయని, అధికారులు నష్టపరిహారాన్ని రాయాలని కోరారు. జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువులు, నిషేధిత బయో కెమికల్స్ మందులు యదేచ్ఛగా అమ్ముతున్నారని తెలిపారు. మండల వ్యవసాయ శాఖ అధికారులు పేక్షక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల ప్రొద్దుటూరు మూతబడిన పాల కేంద్రంలో నకిలీ ఎరువులు మందులు తయారు చేస్తున్న వారిపై దాడులు నిర్వహించారని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య ఉన్నారు. **సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలి** సిద్దవటం మండలం పరిధిలోని పెద్దపల్లె గ్రామ దళితులు 15 సంవత్సరాల నుంచి సర్వేనంబర్ 782 నుంచి 870 వరకు సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ స్పంద లో డిఆర్ఒ కి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్దపల్లి దళితులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ పెద్దపల్లి గ్రామ దళితులు గతంలో హెచ్‌పిసిఎల్‌కు భూములు ఇచ్చి సర్వం కోల్పోయారని పేర్కొన్నారు. అప్పటి రెవెన్యూ అధికారులు భూమికి భూమి, ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చి భూములు తీసుకున్నారని చెప్పారు. ఇప్పటివరకు భూములు కోల్పోయిన వారికి భూమి గానీ, ఉద్యోగాలు ఇవ్వలేదని తెలిపారు. కనీసం సాగులో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు వెంకటయ్య, గ్రామ నాయకులు శ్రీనివాసులు, సుబ్బయ్య, పాపయ్య, సంటి సుబ్బయ్య, దీపం సుబ్బమ్మ పాల్గొన్నారు.

'మానవత'కు బాడీ ఫ్రీజర్ వితరణ

చెన్నూరు : మండలంలోని రామనపల్లి గ్రామానికి చెందిన రాష్ట్ర అటవీశాఖ డైరెక్టర్ రామన శ్రీలక్ష్మి, చంద్రమోహన్‌రెడ్డి కుమారుడు రామన విష్ణు సాయి రెడ్డి చనిపోయి ఏడాది అయిన సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం సోమవారం మానవత సేవా సంస్థ అధ్యక్షులు జయభారత్ రెడ్డి ,ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ సురేష్ యాదవ్, ఉప్పరపల్లికి చెందిన ఎరసాని మోహన్‌రెడ్డి సమక్షంలో బాడీ ఫ్రీజర్ అందజేశారు. వారు విష్ణు స్థాయిరెడ్డి మరణం మమ్మల్ని ఎంతో కలచివేసిందని నివాళులు అర్పించారు. అనంతరం మానవత సేవా సంస్థ సభ్యులు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ జి.ఎన్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మంచి కార్యక్రమాలు చేసేవారు, దాన ధర్మాలు చేసేవారు, మరణించినప్పటికీ వారు ప్రజల హృద యాలలో ఎప్పుడు జీవించే ఉంటారని తెలియజేశారు. కార్యక్రమంలో పుత్త వేణు గోపాల్ రెడ్డి , మహేంద్రరెడ్డి, పెంచల్‌రెడ్డి, రమణారెడ్డి, లక్ష్మి రెడ్డి, చంగ నారాయణ, వైసిపి యువ నాయకులు టి.ఎన్. చంద్రరెడ్డి, వైసిపి ఎస్‌టి సెల్ మండల కన్వీనర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పొడ తెగులు నివారణకు చర్యలు

ప్రజాశక్తి - వల్లూరు

శనగ పంట లో వర్షపు నిలబడిన చోట ఆకు మాడు, పొడ తెగులు పొలం అంతట వ్యాప్తి చెందుతుందని, నివారణకు చర్యలు తీసుకోవాలని ఎఆర్ఎస్ ఊటుకూరు శాస్త్రవేత్తలు డాక్టర్ జోసన్ , డాక్టర్ సునీల్ కుమార్ తెలియజేశారు. సోమవారం మండల కేంద్రంలోని పైడి కాలువ , పెద్దపుత్త గ్రామాల్లో శనగ , మినుము పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకుమాడు, పొడి తెగులు పొలం అందట వ్యాపించకుండా ట్యూబ్ కోనజల్ 1మిల్లీ లీటర్లకు వీటా వ్యాక్స్ పౌడర్1.5 గ్రాములు లీటర్ నీటికి కలపాలన్నారు. దానితోపాటు 13 –0 –45 10 గ్రాములు నీటిలో కలిపి మొక్క మొదలు తడిచే విధంగా పిచికారి చేసుకోవాలని రైతులకు తెలియజేశారు. మినుము పంటలో బూడిద తెగులు ఉండడంతో నివారణ కోసం మైక్ లో బ్యాటానిల్ 1 గ్రామ్ లీటర్ నీటిని కలిపి పిచికారి చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని సాయి జ్యోతి, అగ్రికల్చర్ అసిస్టెంట్ పవన్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఉరితాడును ముద్దాడిన యోధులు

కడప అర్బన్ : ఉరితాడును ముద్దాడిన స్వతంత్ర సమరయోధులు అష్ఫకుల్లా ఖాన్, పండిత రాంప్రసాద్ బిస్మిల్ అని ఆవాజ్ జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చాంద్ బాషా, ఫరూక్ హుస్సేన్ అన్నారు. సోమవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆవాజ్, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్వతంత్ర సమరయోధులు అష్ఫకుల్లా ఖాన్ , పండిత రాం ప్రసాద్ బిస్మిల్ 95 వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇరువురు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో షాజహాన్ పూర్‌లో జన్మిం చారని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే ఆంగ్లేయుల పట్ల వ్యతిరేకత పెంచు కున్నారని తెలిపారు. 1925, ఆగస్టు 3 న హిందుస్థాన్ రిపబ్లిక్ అసోసి యేషన్ నిర్వహించి కకోరి రైలు సంఘటన బ్రిటిష్ అధికారి గుండెల్లో గుబులు రేపిందని చెప్పారు. దీంతో వారిపై కేసులు పెట్టారని పేర్కొ న్నారు. అజ్ఞాతంలో వెళ్లగా ఒక నమ్మకద్రోహి బ్రిటిష్ అధికారులకు సమా చారం ఇచ్చి వారిని పట్టించారని చెప్పారు. బ్రిటిష్ ప్రభుత్వం ఉరిశిక్ష విధించాలని తీర్పు ఇచ్చిందని తెలిపారు. తుది శాస వరకు హిందూ ముస్లిం ఐక్యతకు, మాతృభూమి విముక్తి కొరకు ప్రజలంతా ఏకం కావాలని నిరంతరం శ్రమించేవారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐద్వా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఐ. ఎన్. సుబ్బమ్మ, డివైఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యద ర్శులు షాకీర్, ఓబులేష్ ఉపాధ్యక్షులు విజయ్, ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు గౌస్ పీర్, అన్వర్ బాషా, మస్తాన్, ఖాదర్ బాషా, మెహబూబ్ బాషా, అబ్దుల్ రెహమాన్, వెల్డింగ్ మా బాష పాల్గొన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కాటమయ్య

ప్రజాశక్తి - కడప అర్బన్



ఆంధ్రప్రదేశ్ నాలుగవ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నికలు విజయవాడ ఎపిఎన్‌జిఒ హోమ్‌లో ఈనెల 18 నిర్వ హిం చారు. బి. కాటమయ్యను రాష్ట్ర ఉపా ధ్యక్షులు గా ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. సహక రించిన జిల్లా అధ్యక్షులు రమణారెడ్డికి, కార్య దర్శి డి.శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు విద్యార్థిని ఎంపిక

కడప అర్బన్ :భారత రాజధాని న్యూఢిల్లీలో జనవరి 26న నిర్వహించబోయే గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు కోటిరెడ్డి మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థిని కుమారి. ఎన్. వందన ఎంపికయ్యింది. ఈ సందర్భంగా కళా శాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి. సుబ్బలక్షుమ్మ విద్యార్థినిని అభినందిస్తూ ప్రసంగించారు. మొదట యూని వర్సిటీ స్థాయిలో జిల్లా నుంచి ఎంపికై గుజరాత్ లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ యూనివర్సిటీలో నవంబర్‌లో నిర్వహించిన ప్రీ రిపబ్లిక్ డే క్యాం పులో వందన పాల్గొన్నట్లు తెలిపారు. రాష్ట్రపతి భవన్‌లో నిర్వ హించే కార్యక్రమంలో రాష్ట్రపతిచేతులమీదుగా సర్టిఫికేట్ అందుకుని కళాశాల కీర్తిని రాజధానిలో చాటబోతోందని ప్రిన్సిపల్ ఆనందం వ్యక్తం చేశారు.

టీచర్లను వేధించడం తగదు

కడప అర్బన్ :బదిలీల పేరుతో ఉపాధ్యాయులను వేధించడం అన్యాయమని ఎస్టీయు రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఎస్టీయు భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి అధ్యక్షతన ఏర్పాటులో చేసిన కార్యకర్తల సమావేశంలో సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం బదిలీల మార్గదర్శకాలపై సంఘాలతో కానీ, ఎమ్మెల్సీలతో కానీ చర్చించకుండా, సంఘాల అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకోకుండా హడావిడిగా జి.వో విడుదల చేయడం దారుణమని పేర్కొ న్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు చోద్యం చూడటం ఎంత వరకు సమంజసమన్నారు. కార్యక్రమలో రాష్ట్ర మాజీ అధ్యక్షులు సి.హెచ్.జోసఫ్ సుధీర్‌బాబు నాయకులు పాల్గొన్నారు.

నేషనల్ హైవేస్ ఇఇపై చర్యలు తీసుకోవాలి

కడప అర్బన్ : రాయచోటి నేషనల్ హైవే రోడ్డు ను రియల్ ఎస్టేట్ మాఫియా బుద్ధ ఇన్ ఫ్రాకు అప్పగించిన ఇఇ విజయ్‌కుమార్‌పై పై చర్యలు తీసుకోవాలని సోమవారం కడపకు వచ్చిన ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రద్యుమ్నకు అఖిలపక్ష కమిటీ విజ్ఞప్తి చేసింది. దీనిపై అఖిలపక్ష నాయకులు హరి ప్రసాదు, వెంకట శివ మాట్లాడుతూ ఇఇ ఏకపక్షంగా వ్యవహరించడం తగదన్నారు. ప్రశ్నించిన వారిని బెదిరింపులు పాల్ప డుతున్నారని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేసి కలెక్టర్‌కు, తనకు రిపోర్ట్ ఇవ్వాలని జెసి సాయికాంత్‌వర్మను ప్రద్యుమ్న ఆదేశించారు.



పట్టుబడిన దుంగలను పరిశీలిస్తున్న ఎస్‌పి అన్బురాజన్

ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

ప్రజాశక్తి - కడప అర్బన్

సిద్ధవటం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు ఎర్రచందన స్మగ్లర్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 20 ఎర్రచందన దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి అన్బురాజన్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం సిద్ధవటం మండలం పెద్దపల్లి పంచాయతీలోని రామస్వామి గ్రామానికి పడమర వైపు కొద్ది దూరంలో ఇద్దరు స్మగ్లర్లను ఒంటిమిట్ట, సిద్ధం పోలీసులు అరెస్టు చేశారని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 20 ఎర్రచందన దుంగలు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. స్మగ్లర్లు పోలీసులపై దాడికి ప్రయత్నించగా టాస్క్ ఫోర్స్ సిబ్బంది సహకారంతో తప్పించుకున్నారని చెప్పారు. ఇద్దరు స్మగ్లర్లను పట్టుకోగా మిగిలిన వారు పారిపోయారని పేర్కొన్నారు. స్మగ్లర్లు నరసింహులు, జయకర్ పాల్ ను పోలీసులు పట్టుకున్నారని చెప్పారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేసే వారిపై పీడీ యాక్టు ప్రయోగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఫ్యాక్షన్ జోన్ డిఎస్‌పి చెంచు బాబు, టాస్క్‌ఫోర్సు సిఐ నాగభూషణ్, ఒంటిమిట్ట సిఐ పురుషోత్తమరాజు, సిద్ధవటం ఎస్ఐ నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని ఆశీర్వదించాలి : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని ఆశీర్వదించాలని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాష అన్నారు. సోమవారం స్థానిక జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదినం పురష్కరించుకుని ముం దస్తుగా క్రీడా పోటీలను నిర్వహించారు. క్రీడాకారులతో పరిచేయం చేసుకుని క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 50వ జన్మదినం పుర స్కరించుకొని అన్ని నియోజకవర్గాలలోనూ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రెండు రోజుల పాటు పోటీలుంటాయన్నారు. గెలుపొందిన వారికి, రన్నర్లుగా ఉన్నవారికి, పాల్గొన్న ప్రతి క్రీడాకారునికి బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ సురేషబాబు, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్ కుమార్, నాయకులు డాక్టర్ సోహైల్ అహమ్మద్, కాల్ టాక్స్ హఫీజుల్లా, మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్ బంగారు నాగయ్య యాదవ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా

ప్రజాశక్తి- కడప

ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా రాదు, పోలవరం పూర్తికాదని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంటు సాక్షిగా చెప్పడం అత్యంత దురదృష్టకరమని, కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యమని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నరెడ్డి తులసిరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఆంధ్రప్రదేశ్ హక్కు అని, రాష్ట్రానికి సంజీవిని అని అన్నారు. ప్రస్తుతం దేశంలోని పది రాష్ట్రాల్లో, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రత్యేక హోదా అమలులో ఉందని చెప్పారు. హోదా వస్తే అనేక ప్రయో జనాలున్నాయని, కేంద్ర ప్రయోగిత పథకాలకు 90 శాతం నిధులు కేం ద్రం భరిస్తుందని అన్నారు. హోదా లేని రాష్ట్రాలకు 60 శాతం నిధులు మాత్రమే కేంద్రం ఇస్తుంది అన్నారు. పోలవరం పూర్తి కావాలంటే ఇంకా 55 వేల కోట్లు అవసరమని, కానీ కేంద్రం 2442 కోట్లు మాత్రమే ఇస్తాన నడం దుర్మార్గమని చెప్పారు. ప్రజలు ఆలోచించి ఇప్పటికైనా కాంగ్రెస్‌ను ఆదరించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, చీకటి చార్లెస్, ఉపాధ్యక్షుడు మధు రెడ్డి, సుబ్రమణ్య శర్మ, తిరుమలేష్, ఓబయ్య, ప్రసాద్, సుబ్బారెడ్డి, మహిళా అధ్యక్షురాలు పాల్గొన్నారు.

శాంతి కోసం పాటుపడాలి

ప్రజాశక్తి - కడప

శాంతి, సేవాదృక్పథం వంటి వాటితో ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలని పిసిసి మీడియా చైర్మన్ డా.తులసిరెడ్డి సూచించారు. క్రిస్మస్‌పర్వదినాన్ని పురస్కరించుకొని పీసీసీ కార్యదర్శి చీకటి చార్లెస్ ఆధ్వర్యంలో ఇందిరా భవన్‌లో ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. తులసిరెడ్డి, నీలి శ్రీనివాసరావు కేక్ కట్ చేసి క్రైస్తవ సోదర సోదరిమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఫ్యామిలీ పెన్షన్ పరిమితి లేకుండా చెల్లించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎల్ఐసి పెన్షనర్ల కుటుంబ పింఛను 30 శాతానికి పెంచాలని ఎల్ఐసి పెన్షన్ల సంఘం కడప డివిజన్ అధ్యక్షులు ఎస్.సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి కె.సుధీకర్, మాజీ ప్రధాన కార్యదర్శి కె.శంకర్రావు డిమాండ్ చేశారు. సోమవారం ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం వద్ద పెన్షనర్స్ ఉద్యమానికి ఆద్యులైన డి.ఎస్.నకారా, ఎల్ఐసి ఉద్యోగులకు పెన్షన్ సాధించిన ఎస్.ఎం. సుందరం, ఇటీవల మరణించిన కడప డివిజన్ పెన్షనర్ల పూర్వ అధ్యక్షులు సి.ఎస్.ప్రకాష్ రావు కు శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం, దేశవ్యాప్త పిలుపు మేరకు జరుగుతున్న ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పైన కేంద్ర ఆర్థిక శాఖ దృష్టి సారించాలన్నారు. ఫ్యామిలీ పెన్షన్ పెంచాలని ఎల్ఐసి బోర్డు మూడేళ్ల కిందటే కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసినా, ఇంతవరకు నోటిఫికేషన్ విడుదల చేయలేదన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఉద్యోగులకు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ అప్డేషన్ అమలవుతోందని, కానీ ఎల్ఐసి పెన్షనర్ల విషయంలో మాత్రమే కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని చెప్పారు. ధర్నా కార్యక్రమానికి ఇతర రంగాల పెన్షనర్ల సంఘాల జిల్లా నాయకులు శివశంకర్ రెడ్డి (బ్యాంకింగ్), సుధాకర్ (టెలికాం), సుబ్బరాయుడు (పోస్టల్) పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఐసి సంఘాల నేతలు అవధానం శ్రీనివాస్, సంజయ్ కుమార్, చంద్రపాల్, ఆనందరావు, నిత్యానంద రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, అమర్నాథ్ బాబు, ముడియం కిషోర్, నారాయణ, అమరేశ్వరుడు పాల్గొన్నారు. ధర్నా సందర్భంగా ఆమోదించిన డిమాండ్ల పత్రాన్ని ఎల్ఐసి కడప సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.గిరిధర్ కులి పెన్షనర్ల ప్రతినిధి బృందం సమర్పించింది, సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు.



రిజిస్ట్రార్‌ను సన్మానిస్తున్న ప్రయివేట్ కళాశాలల యాజమాన్యం

వైవీయూ రిజిస్ట్రార్‌గా వెంకట సుబ్బయ్య

ప్రజాశక్తి -కడప అర్బన్

వైవీయూ రిజిస్ట్రార్‌గా వై. పి. వెంకటసుబ్బయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీసీ సూర్య కళావతి, పూర్వ బాధ్యులు విజయ రాఘవ ప్రసాద్, ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, పాలక మండలి సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. **రిజిస్ట్రార్‌కు సన్మానం** నూతన రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటసుబ్బయ్యను ప్రయివేట్ కళాశాల యాజమాన్యం సన్మానించారు. సోమవారం వైవీయూలో రిజిస్ట్రార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్. విజయ్ కుమార్, సుబ్బానాయుడు, ఇ.శంకర్, సిద్దయ్య, శీను, గీతాంజలి రమణ, మేధా నరసింహులు పాల్గొన్నారు.

ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల మళ్లింపు దారుణం

ప్రజాశక్తి- కడప అర్బన్



మాట్లాడుతున్న మన్నూర్ అక్బర్

పేద దళితులకు సబ్ ప్లాన్ నిధులు ఖర్చు చేయకుండా నవరత్నాలకు ప్రభుత్వం వాడుకోవటం దారుణమని సబ్ ప్లాన్ నిధులు పూర్తిగా వారికే ఖర్చు చేయాలని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి మన్నూర్ అక్బర్ డిమాండ్ చేశారు. సోమవారం పాత బస్టాండ్ లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం లో అమలు చేసిన పథకాలను కూడా రద్దు చేశారని విమ ర్శించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అమలు చేయాలని కోరారు. లేని యెడల ప్రభుత్వం పైన అట్రాసిటీ కేసు నమోదుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న దళితులకు అండగా పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అవగానే దళితులకు కేటాయించిన నిధులు పూర్తిగా సబ్ ప్లాన్ ద్వారా ఖర్చు చేస్తామని తెలిపారు.

సిడిసి డీన్ నూతన కార్యాలయం ప్రారంభం

కడప అర్బన్ : కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ (సీడీసీ) నూతన కార్యాలయాన్ని వైవీయూ విసి మునగల సూర్య కళావతి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాంగణంలోని నూతన పరిపాలన భవనంలో ఏర్పాటైన కార్యాలయంలో అధునాతన వసతులు కల్పించామని తెలిపారు. సిడిసి డీన్ ఆచార్య వై.సుబ్బరాయుడు తన కార్యాలయం పరిపాలనలో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నూతన రిజిస్ట్రార్ వై.పి. వెంకటసుబ్బయ్య, పూర్వపు రిజిస్ట్రార్ ఆచార్య దుర్భాక విజయరాఘవ ప్రసాద్, ప్రిన్సిపల్ కె.కృష్ణారెడ్డి, ఐక్యూఎసి డాక్టర్ డైరెక్టర్ సుబ్రమణ్యంశర్మ , డాక్టర్ ఎస్.పి.వి. రమణ, డాక్టర్ విజయకుమార్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

పోరుమామిళ్ల : స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ తెలుగు, ఉర్దూ స్కూల్‌లో నిర్వహిస్తున్న నాడు–నేడు పనులను అడ్వైజర్ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ పి. నాగార్జునరెడ్డి తనిఖీ చేశారు. జడ్‌పిహెచ్ఎస్ తెలుగు పాఠ శాలలో నిధులు ఉన్నా, దాదాపు 6 నెలల నుంచి పనులు ఎందుకు ఆలస్యం చేస్తున్నారని వివరణ కోరారు. నిధులు ఉన్నను పనులు చేయకపోతే ప్రభు త్వానికి చెడ్డ పేరు వస్తుందని చెప్పారు. రాబోయే మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తర్వాత ఉర్దూ స్కూల్‌లో పనులు పరిశీలించి, విద్యార్థులతో చదువు, మధ్యాహ్నం భోజనం గురించి తెలుసు కున్నారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈనెల 21 బుధవారం జగన్ పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇస్తారని తెలిపారు.

రాష్ట్రంలోనే మేటి పులివెందుల ఆర్‌టిసి బస్టాండ్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాష్ట్రంలోనే ఎక్కడాలేని విధంగా పులివెందుల ఆర్‌టిసి నూతన బస్టాండ్ నిర్మాణం జరుగుతోందని ఆర్‌టిసి చైర్మన్ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 24, 25న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటనకు వస్తున్నందున నూతన బస్టాండ్ నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లి కార్జున రెడ్డి మాట్లాడుతూ దాదాపు రూ.35 కోట్లతో బస్టాండ్, గ్యారేజీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. పనులు సంతృప్తికరంగా ఉన్నాయని, ప్రయాణికులకు అన్ని వసతులు ఉండేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. విశాలమైన విశ్రాంతి గదులు, కార్గో గదులు వంటి సౌకర్యాలున్నాయన్నారు. ఇలాంటి పెద్ద ఆర్‌టిసి బస్టాండ్ ఎక్కడా లేదని, బస్టాండ్ చుట్టూ సిసి రోడ్లు ఏర్పాటు చేశారన్నారు. గ్యారేజ్‌లో కూడా అన్ని భవనాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు, వైసిపి నాయకులు చవ్వా సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్ కోడి రమణ, ఆర్‌టిసి అధికారులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న మల్లికార్జునరెడ్డి

కబడ్డీ పోటీలకు పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలకు ఆయా పాఠశాలల విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని వైసిపి మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆటస్థలంలో మండలస్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళ, బుధవారాల్లో విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ పేర్లను జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో గురుప్రసాద్ వద్ద నమోదు చేసుకోవాలని కోరారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆ సారొస్తే పిల్లలను బడికి పంపలేమని ఎంఇఒకు వినతి

- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశా : ఎంఇఒ

ప్రజాశక్తి - కొండాపురం

ఆ సారు వస్తే పిల్లలను బడికి పంపలేమంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఇఒ ఓబులేస్‌కు సోమవారం వినతిపత్రమిచ్చారు. మండల కేంద్రంలోని రామ సుబ్బారెడ్డినగర్ పాఠశాలలో ప్రస్తుతం ముగ్గురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వారిలో జయరాజ అనే ఉపాధ్యాయుడు ఈ ఏడాది ఫిబ్రవరి 3న బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన ప్రతి రోజు కడప నుండి వస్తూండడంతో విధులకు చాలా ఆలస్యమయ్యేదనే ఆరోపణలున్నాయి. తమచే అన్నం తిన్న తర్వాత క్యారియర్, పల్లెం శుభ్రం చేయిస్తారని విద్యార్థులు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు వి.సుబ్బారెడ్డి పలుమార్లు మందలించినప్పటికీ ఆయనలో మార్పు రాలేదని సమాచారం. జయరాజు ప్రవర్తనపై ప్రధానోపాధ్యాయులు వి.సుబ్బారెడ్డి ఎంఇఒకు జులైలో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఎంఇఒ ఓబులేసు విచారించి జయరాజును ఓబన్నపేట పాఠశాలకు ఈ ఏడాది జులై 20న డిప్యుటేషన్‌పై బదిలీలు చేశారు. ఆ పాఠశాలలో కూడా జయరాజు ప్రవర్తనలో మార్పురాక పోగా, స్థానికులతో సైతం గొడవ పడేవారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మళ్లీ రామసుబ్బారెడ్డి నగర్ పాఠశాలకు రావాలని చూస్తున్నారని ఆ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఎంఇఒకు వినతిపత్రమిచ్చారు. దీనిపై ఎంఇఒ ఓబులేస్ వివరణ ఇస్తూ.. జయరాజు ఉపాధ్యాయుడిని రామసుబ్బారెడ్డి నగర్ నుంచి డిప్యుటేషన్‌పై ఓబన్నపేట పాఠశాలకు, అక్కడి నుంచి గండ్లూరు పాఠశాలకు డిప్యుటేషన్ వేశామన్నారు. అయినా విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.




ఎంఇఒకు వినతిపత్రమిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు వీరమోక్షిత ఎంపిక

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని ఉప్పలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎ.వీరమోక్షిత జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు శివశంకర్ రెడ్డి తెలిపారు. ఆ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ కమలాపురంలో నిర్వహించిన త్రోబాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో కడప జిల్లా జట్టు తరపున పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థి వీరమోక్షితను ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి అభినందించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



విద్యార్థి వీరమోక్షితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రహదారికి మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని జగనన్న కాలనీ ప్రధాన రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని టిడ్కో ఇంజినీరింగ్ అధికారులకు మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ సూచించారు. టిడ్కో గృహ నిర్మాణ పనుల కోసం భారీ వాహనాల రాకపోకల వల్ల ఈ రహదారి పూర్తిగా దెబ్బతిందన్నారు. సోమవారం అయన టిడ్కో గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. జగనన్న కాలనీకి సంబంధించిన ప్రధాన రహదారుల మరమ్మతులు, టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టే కాంట్రాక్టర్లే మరమ్మతులు చేయాలని కలెక్టర్ సూచించారని అయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడ్కో డిఇ రత్నరాజు, ఎఇ నరేష్, హౌసింగ్ ఎఇ శ్రీనివాసులు పాల్గొన్నారు.



టిడ్కో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ జగన్నాథ్

అర్జీదారుల సమస్యలను పరిష్కరించండి

- జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్

ప్రజాశక్తి - కడప

ప్రజా సమస్యల పరిష్కారార్థం ఏర్పాటు చేసిన 'స్పందన' కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ ఆదేశించారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ తో పాటు డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు యదుభూషన్ రెడ్డి, పెద్దిరాజు , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ మోహన్, నరసింహులు, చంద్రమౌళి హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. కడప పట్టణానికి చెందిన పి.రామలోకం నాయుడు బెటాలియన్‌లో వంట మనిషిగా ఉద్యోగం కోరుతూ జిల్లా స్పందన హాలులో కలెక్టర్ వారికి వినతిపత్రం సమర్పించారు. పోరుమామిళ్ల మండల కేంద్రానికి చెందిన ఎస్. బి. అలీ బాషా తనకు ఇంటి స్థలం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. దువ్వూరు మండలం, నూతన సి.మోహన్ రెడ్డి తన ఇంటి స్థలంలో వేసిన సి.సి. రోడ్డును తొలగించాలని కోరుతూ కోరారు. కార్యక్రమంలో సిపివో వెంకట రావు, హౌసింగ్ పీడి కృష్ణయ్య, మెప్మా పీడి రామమోహన్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ ఈ శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ జేడి నాగేశ్వర రావు, సమగ్ర శిక్ష ఏపిసి ప్రభాకర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రహదారి ఇబ్బందులు తొలగేదెన్నడో..!

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నగర పంచాయితీ పరిధిలోని రాణివనంలో రోడ్లపై నీరు నిలుస్తుండడంతో స్థానికులు అగచాట్లు పడుతున్నారు. ఈ ఇబ్బందులు తొలగేదెన్నడని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రజలు ఈ మురుగు నీటిలోనే వెళ్లాల్సి వస్తోంది. స్థానిక కౌన్సిలర్ ఆధ్వర్యంలో నగర పంచాయితీ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా వ్యాధులు వస్తే ఆసుపత్రికి వెళతారు.. కానీ ఇక్కడ ఆసుపత్రి దగ్గరకు వెళితే వ్యాధులపాలయ్యే పరిస్థితి అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలంటూ అధికారులు పారిశుధ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సూక్తులు చెబుతున్నారే తప్ప వారు పాటించే పరిస్థితిలో లేరనే ఆరోపణలున్నాయి. రోడ్డుపై నిలిచిన నీటిని వెంటనే తొలగించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.



పిహెచ్‌సి ముందు రోడ్డుపై నిలిచిన నీరు

సమస్యలు తెలుసుకునేందుకే ఇంటింటికీ : ఎమ్మెల్యే



ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

సమస్యలను తెలుసుకునేందుకే ప్రతి ఇంటికి వస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని హనుమనగుత్తి పంచాయితీ పరిధిలోని వెంకన్నపల్లెలో సోమవారం ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడప తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రతి కుటుంబానికి సంబంధించిన కరపత్రాన్ని అందజేశారు. స్థానికులు చిన్నపాటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అక్కడే ఉన్న సంబంధిత అధికారులకు సత్వరమే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి, సిఐ మంజునాథరెడ్డి, సర్పంచు, ఎంపిటిసి, పార్టీ నాయకులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రిజర్వేషన్ శాతం పెంచాలి : ఎంఆర్‌పిఎస్



ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల రిజర్వేషన్‌ల శాతం 50నుంచి 80కి పెంచాలని ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.కర్ణ కోరారు. ఆ మేరకు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సామజిక న్యాయ పోరాట ధర్నా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీ ఆర్‌డిఒ కార్యాలయం వరకు సాగింది. అనంతరం కార్యాలయ ఎఒ అక్బల్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కర్ణ మాట్లాడుతూ కులాల గణాంకాల ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. భారతదేశంలో షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లు 76 సంవత్సరాలుగా 50 శాతానికి మించలేదన్నారు. జనాభా గణంకాల ప్రకారం రిజర్వేషన్లను 80 శాతానికి పెంచడానికి పార్లమెంట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు పొందుతున్న కులాల జనాభా పదింతలు పెరిగినా రిజర్వేషన్లు అలాగే ఉన్నాయన్నారు. దేశం మొత్తం మీద తమిళనాడు రాష్ట్రంలో 69 శాతం రిజర్వేషన్లు 1993 నుంచి పార్లమెంటు ఆమోదంతో పొందుతున్నారని, మిగతా రాష్ట్రాల్లో కేవలం 50 శాతానికి లోబడి మాత్రమే అమలవుతున్నాయన్నారు. బిసి కులాలను ఎబిసిడిలు చేసినట్లుగా ఎస్‌సి, ఎస్‌టి కులాలకు కూడా వర్గీకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు టి.తిరుమలయ్య, కార్యదర్శి పుల్లయ్య, మహిళ అధ్యక్షురాలు చెన్నమ్మ, జమ్మలమడుగు, ముద్దనూరు నాయకులు ఓబులేసు, శ్రీరాముడు, మునయ్య, జయన్న పాల్గొన్నారు.

నేటి ఇంధన పొదుపు.. భవిష్యత్ తరాలకు వెలుగు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

నేడు మనం ఇంధనాన్ని పొదుపుగా వినియోగిస్తే భవిష్యత్ తరాలకు వెలుగును ఇవ్వవచ్చని విద్యుత్ అధికారి శ్రీనివాసులరెడ్డి సూచించారు. ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా సోమవారం విద్యుత్ అధికారులు, సిబ్బంది, వినియోగదారులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక విద్యుత్ కార్యాలయం నుండి శివాలయం సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఇంధనాన్ని పొదుపుగా వాడడం వల్ల పర్యావరణం పరిరక్షించవచ్చన్నారు. ఒక యూనిట్ ఇంధన పొదుపు రెండు యూనిట్ల ఇంధన ఉత్పత్తితో సమానమన్నారు. ఎల్‌ఇడి బల్బులనే వాడాలన్నారు. ఇంధనాన్ని సంరక్షించుకొని ఇంధన సామర్థ్యం పెంచుకోవాలని శ్రీనివాసులరెడ్డి కోరారు.



ర్యాలీ చేస్తున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది

ఎమ్మెల్యే సహకారంతో చర్చి అభివృద్ధి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మరోసారి క్రైస్తవుల పట్ల ప్రేమ, అభిమానాన్ని చాటుకున్నారు. పట్టణంలో సిఎస్ఐ టౌన్ చర్చి ఆవరణం తగ్గు కావడం వల్ల చర్చికి వచ్చే క్రైస్తవులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు నీళ్ల ఆవరణలో నిలిచి అపరిశుభ్రంగా తయారయ్యేది. ప్రార్థనలు చేసుకోవడానికి అసౌకర్యంగా ఉండది. ఈ పరిస్థితుల్లో ఎపి ఇండస్ట్రియల్ డైరెక్టర్ మార్బుల్ శీను విన్నపం మేరకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సోమవారం ఉదయం మార్బుల్ శీను ఆధ్వర్యంలో నాలుగు టిప్పర్ల మేర ఇసుక చర్చి ఆవరణ చుట్టూ తోలించారు. ఈ సందర్భంగా మార్బుల్ శీను మాట్లాడుతూ క్రైస్తవ భక్తులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగానే ఆయన వెంటనే స్పందించారని తెలిపారు. ఇందుకు సిఎస్ఐ టౌన్ చర్చి, వివిధ సంఘాల తరపున జమ్మలమడుగు, పరిసర ప్రాంత క్రైస్తవులు, వారి కుటుంబాల తరపున ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినట్లు మార్బుల్ శీను పేర్కొన్నారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ మార్బుల్ శీను

ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ప్రజాశక్తి - మైదుకూరు

ప్రస్తుత శీతాకాల సమావేశాల్లోనే ఎస్‌సి వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఒక్కరోజు మహాదీక్ష నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంఆర్‌పిఎస్ జిల్లా కన్వీనర్ మానికింద వెంకటేష్ మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా నాయకులు జయచంద్ర మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా జయచంద్ర మాదిగ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వర్గీకరణ చేయకుండా మాదిగలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామన్న మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రస్తుత శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రమిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఎంఆర్‌పిఎస్ కన్వీనర్ ఒ.కైలాష్, మైదుకూరు మండల మహాజన సోషల్ పార్టీ ఇన్‌ఛార్జి సునీల్, నాయకులు బాషా, మహేష్, ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకులు నరసింహులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతి పత్రమిస్తున్న నాయకులు

వైసిపి పాలనలో శాంతి భద్రతలు కరువు : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

వైసిపి పాలనలో శాంతిభద్రలు కరవయ్యాయని టిడిపి నగర అధ్యక్షులు శివకొండారెడ్డి విమర్శించారు. సోమవారం నగరంలోని ఆర్‌టిసి బస్టాండ్, అప్సర సర్కిల్ వద్ద నగర కమిటీ ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ కొండారెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి జలతోటి జయకుమార్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి చేస్తున్న మోసాలు, అన్యాయాలు, అక్రమాలు, అరాచకాలు, దారుణాలు గురించి ప్రజలకు తెలియజేసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్క ఇంటికి తిరుగుతూ ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అని వైసీపీ ప్రభుత్వం చేస్తున్నా అవినీతిని ఎక్కడికి అక్కడ ఎండ కడుతున్నామని తెలిపారు. రాబోవు రోజులలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతారని, ఇందులో ఏలాంటి సందేహం అవసరం లేదన్నారు. కార్యక్రమంలో భాగంగా తెలుగు యువత నగర అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, 28వ డివిజన్ ఇన్‌ఛార్జి రాఘవ, 6వ డివిజన్ ఇన్‌చార్జ్ వరదా కిరణ్ కుమార్ యాదవ్, 47వ డివిజన్ ఇన్‌చార్జ్ జనార్ధన్‌రెడ్డి, కడప ఎస్సీ సెల్ అధ్యక్షులు ఓబులేష్ పాల్గొన్నారు.



ఇదేం కర్మ కార్యక్రమానికి మిస్డ్ కాల్ చేస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా ముగిసిన ఎన్‌సిసి క్యాంపు

ప్రజాశక్తి - కడప

ఈనెల 12 నుంచి 19 వరకు నిర్వహించిన కంబైన్డ్ వార్షిక ఎన్‌సిసి శిబిరం సోమవారం ముగిసింది. ముగింపు సమావేశంలో క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ విభోర్ గుప్తా క్యాడెట్లను ఉద్దేశించి మాట్లాడుతూ శిక్షణలో తెలుసుకున్న విషయాలను మర్చిపోకుండా 'బి', 'సి' సర్టిఫికెట్ పరీక్ష లో మంచిగా ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ సందర్భంగా డ్రిల్, ఫైరింగ్, మోడల్ టెస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలలో రాణించిన కేడేట్లను మెడల్స్‌తో సత్కరించారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ తాపా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో కడప, అన్నమయ్య జిల్లాల ఎన్‌సిసి అధికారులు లెఫ్టినెంట్ నీలయ్య, లెఫ్టినెంట్ మహేష్, లెఫ్టినెంట్ వెంకటరమణ, థర్డ్ ఆఫీసర్లు పి. రాజశేఖర్, ఇమామ్ కాసిం, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైన్సు పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకొని పరిశోధనలపై దృష్టి సారించాలని ఎంఇఒ నాగ స్వర్ణలత సూచించారు. ఖాజీపేటలో సోమ వారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలించి, అభినందించారు. దేశాభివృద్ధి సైన్స్‌తోనే సాధ్యమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకుని, పరిశోధనలపై దృష్టి పెడితే దేశం సాంకేతికపరంగా ముందుకెళుతుందని ఎంఇఒ వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నమూనాలను తిలకిస్తున్న ఎంఇఒ నాగస్వర్ణలత

పారదర్శకంగా రబీ పంటల నమోదు

ప్రజాశక్తి - ముద్దనూరు

రబీలో సాగు చేసిన పంటలను పారదర్శకంగా పంట నమోదు చేయాలని తహశీల్దార్ వెంకటేశ్వర్లు సూచించారు. ఎంపిడిఒ కార్యాలయ సభాభవనంలో సోమవారం వ్యవసాయ, రెవెన్యూ శాఖల అనుసంధానంతో తహశీల్దార్ అధ్యక్షతన ఎఒ వెంకటకృష్ణారెడ్డి క్షేత్రస్థాయి సిబ్బందితో రబీ పంట నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా పని చేయాలన్నారు. ఎఒ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సాగు చేసిన ప్రతి పంటను వ్యవసాయ, రెవెన్యూ శాఖల జాయింట్ అజమాయిషీతో ప్రతి సర్వే నంబర్లు క్షుణ్ణంగా పరిశీలించి, పంట నమోదు చేయాలన్నారు. పంట నమోదు చేసుకునే సమయంలో ధ్రువీకరణ పత్రంలో రైతు సంతకం తీసుకుని ఆమోద పత్రాన్ని సిబ్బంది దగ్గర ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటేశ్వర్లు

గృహ ప్రవేశాలు సంతోషదాయకం

ప్రజాశక్తి - చక్రాయపేట

జగనన్న కాలనీలో గృహప్రవేశాలు సంతోషకరమని జడ్‌పిటిసి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలం కొండప్ప గారిపల్లిలో సోమవారం లబ్ధిదారులు గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి మాట్లాడుతూ గ్రామంలో సంగాలమ్మ, ప్రసాద్ దంపతులు ఇంట్లో చేరడం హర్షణీయమన్నారు. ఎంపిపి మాధవి బాలకృష్ణ మాట్లాడుతూ కాలనీలోని అన్ని ఇళ్లను పూర్తి చేసి అందరూ గృహప్రవేశాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమానికి సమన్వయకర్త ఓబుల్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు శేషారెడ్డి, ఎంపిటిసి మోహన్‌రెడ్డి, గండి దేవస్థాన పాలక మండలి సభ్యులు లోమడ రామాంజనేయరెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



జగనన్న గృహప్రవేశంలో ప్రజాప్రతినిధులు

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

గెలుపు, ఓటమిని సమానంగా స్వీకరించాలని మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వైసిపి ఆధ్వర్యంలో స్థానిక వైఎస్ఆర్ ఇండోర్‌స్టేడియంలో ఏర్పాటు చేసిన షటిల్ టోర్నమెంట్‌ను సోమవారం మనోహర్ రెడ్డి. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజుల్లా, సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి ప్రారంభించారు. అన్ని రకాల ఆటలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. క్రీడాకారులంతా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాలని ఆశిస్తున్నామన్నారు. అనంతరం వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్ కొద్దిసేపు షటిల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పార్లపల్లి కిషోర్, లక్ష్మీభార్గవి, మహేష్, ఖాదర్ బాషా, వైసిపి నాయకులు సిద్దయ్య. సోపాల వీర పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - మైదుకూరు

చలికాలంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు డివి సందీప్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని వనిపెంట ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహంలో సోమవారం వసతిగృహ అధికారి ముస్తాక్ అహ్మద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు డివి సందీప్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చలికాలంలో జలుబు, దగ్గు, చర్మవ్యాధులు సోకే అవకాశం ఉందని పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ తహశీన్ బాషా, ఎంఎల్‌హెచ్‌పి పద్మావతి, రాజేశ్వరమ్మ, ప్రసన్న, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్‌పి అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమంలో బాధితులతో స్వయంగా, ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు పలకలు పంపిణీ

పోరుమామిళ్ల టౌన్ : రామాయపల్లి ఎంపిపి పాఠశాలలోని 54 మంది నిరుపేద విద్యార్థులకు సోమవారం పలకలు, పాదరక్షలు, వాటర్ బాటిల్స్‌ను సోమవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో అత్తలూరి సాయి సందీప్ జ్ఞాపకార్థం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవ సలహాదారులు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చాగలకొండు గురుమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి సమావేశంలో మాట్లాడుతూ, రామకృష్ణారెడ్డి నిస్వార్థంగా నిరుపేదల కోసం చేస్తున్న సేవలు అమోఘమని శ్లాఘనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుపాకుల శ్రీనివాసులు, ఉపాధ్యాయురాలు హుస్సేన్ బీ, వివేకానంద ఫౌండేషన్ ప్రతినిధులు ప్రసాద్, చందు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - పెండ్లిమర్రి

మండలంలోని తుమ్మలూరు దళితవాడలో ఈనెల 17న ఒక ఇంటి తగాదా విషయమై సమీప బంధువైన వెంకటరమణ అనే వ్యక్తిని హత్యచేయాలనే ఉద్దేశంతో సాంబశివుడు కత్తితో దాడి చేశాడని ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ దాడిలో వెంకటరమణ తీవ్రంగా గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతున్నాడని పేర్కొన్నారు. సోమవారం ఎస్‌పి అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప డిఎస్‌పి బివి శివారెడ్డి, కడప రూరల్ సిఐ అశోక్‌రెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ తన సిబ్బందితో సాంబశివుడు అనే ముద్దాయిని సోమవారం అరెస్ట్ చేశారు. అతని వద్దనుండి నేరానికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. నిందితుడ్ని రిమాండ్ కోర్టులో హాజరుపెట్టామన్నారు.



ఎస్ఎస్‌సి మోడల్ పేపర్స్ ఆవిష్కరణ



ఎస్ఎస్‌సి మోడల్ పేపర్స్‌ను ఆవిష్కరిస్తున్న డివైఇఒ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సీనియర్ ఉపాధ్యాయులచే తయారు చేయించిన పదవ తరగతి మోడల్ పేపర్ల పుస్తకాన్ని సోమవారం మదనపల్లి డివైఇఒ కృష్ణప్ప ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ వారిచే నూతన పరీక్ష విధానానికి అనుగుణంగా తయారు చేసిన మోడల్ పేపర్లు అందరి పిల్లలకు ఉపయోగపడేలా తయారు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సుధాకర్ నాయుడు, డివిజన్ కన్వీనర్ సుధాకర్, రాష్ట్ర కౌన్సిలర్ పురం వెంకటరమణ, పయాని హరికృష్ణ, సీనప్ప, అంజాద్‌బాషా పాల్గొన్నారు.


స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీలో గోల్‌మాల్

- ఒకే నోటిఫికేషన్ కిందే ఎఆర్‌టి, యుపిహెచ్‌సి పోస్టుల భర్తీ!
- 25 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీపై గందరగోళం
- ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌పై ఫిర్యాదు

జిల్లాలో స్టాఫ్‌నర్సు పోస్టుల రిక్రూట్‌మెంట్ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఎపి శాక్స్) నోటిఫికేషన్ కింద ఎఆర్‌టి, ఇతర మాధ్యమంలో యుపిహెచ్‌సి విభాగాల కింద వేర్వేరుగా చేపట్టిన 25 స్టాఫ్‌నర్సుల నియామకాలపై గందరగోళం చోటుచేసుకుంది. ఒకే నోటిఫికేషన్, ఒకే రోస్టర్ కింద రెండు విభాగాల పరిధిలోని స్టాఫ్‌నర్సుల పోస్టులను ఎలా భర్తీ చేస్తారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ వర్తించని నోటిఫికేషన్‌కు వచ్చిన వందలాది దరఖాస్తులను ఒకే రోస్టర్ మెరిట్ ఆధారంగా యుపిహెచ్‌సి స్టాఫ్‌నర్సు పోస్టులను ఎలా భర్తీ చేస్తారని, వాటిని రద్దు చేసి మళ్లీ నోటిఫికేషన్ జారీ చేయాలనే వాదన పెద్దఎత్తున వినిపిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఎపి శాక్స్) నోటిఫికేషన్ ఆధ్వర్యంలో స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది ఆగస్టులో ఎపిశాక్స్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రూ.21 వేల వేతనంతో ఐదు ఎఆర్‌టి (ఆంటీ రిట్రోవైరల్ థెరపీ) స్టాఫ్‌నర్సుల పోస్టులకు 270 స్టాఫ్‌నర్సు పోస్టులకు దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి ఇడబ్ల్యుస్ రిజర్వేషన్ వర్తించదని నోటిఫికేషన్ స్పష్టం చేసినట్లు సమాచారం. నవంబర్ 12న డిఎంహెచ్ఒ, అడిషనల్ డిఎంహెచ్ఒలతో కూడిన రిక్రూట్‌మెంట్ కమిటీ ఐదు స్టాఫ్‌నర్స్, ఆరు ల్యాబ్ టెక్నీషియన్స్, నలుగురు కౌన్సిలర్లు, ఒక్కొక్కరు చొప్పున ఫార్మ సిస్ట్, మెడికల్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసింది. ఇందులోని ఐదుగురు స్టాఫ్‌నర్సుల పోస్టులకు ముగ్గురు మాత్రమే ఎంపికయ్యారు. మిగిలిన రెండు పోస్టుల భర్తీ నిమిత్తం మరోసారి నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. మొదటి, రెండవ దఫా నోటిఫికేషన్ కింద రిక్రూటైన ఐదుగురు ఎఆర్‌టి స్టాఫ్‌నర్సులను ఉమ్మడి కడప జిల్లాలోని రిమ్స్, ప్రొద్దుటూరు, రాయచోటి, రాజంపేట, పులివెందుల ఎఆర్‌టి సెంటర్లలో నియమించారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ (యుపిహెచ్‌సి) కింద 20 మంది స్టాఫ్ నర్సులను నియమించాలని ఆదేశాలు అందడంతో నోటిఫికేషన్ విడుదల చేయాల్సి వచ్చింది. జిల్లా వైద్యఆరోగ్య శాఖ రెండవ కేటగిరీ కింద యుపిహెచ్‌సి స్టాఫ్‌నర్సుల



రిక్రూట్‌మెంట్ నిమిత్తం నోటిఫికేషన్ జారీ చేయాల్సిన నేపథ్యంలో డిసెంబర్ 16న గుర్తు తెలియని మీడియా మాధ్యమంలో నోటిఫికేషన్ ఇచ్చినట్లు సమాచారం. యుపిహెచ్‌సి నోటిఫికేషన్ సమాచారం తెలియకపోవడంతో నిరుద్యోగులకు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. దీన్ని అవకాశంగా తీసుకున్న రిక్రూట్‌మెంట్ కమిటీ ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ వర్తించని ఎపిశాక్స్ నోటిఫికేషన్ కింద వచ్చిన 270 పైగా దరఖాస్తుల్లో ఎఆర్‌టి కేటగిరీ కింద భర్తీ చేసిన ఐదు పోస్టులు దక్కించుకున్న దరఖాస్తులను మినహాయించి మిగిలిన దరఖాస్తులతో రిక్రూట్‌మెంట్ కథ నడిపించారనే విమర్శలు పెద్దఎత్తున ఉన్నాయి. యుపిహెచ్‌సి కేటగిరీ కింద రూ.24 వేల వేతన ప్రాతిపదికన 20 స్టాఫ్‌నర్సుల పోస్టుల ఎంపిక అత్యవసరమైతే గతంలో యుపిహెచ్‌సి కింద సీనియారిటీ జాబితా ప్రకారమైనా చేయాలి. లేనిపక్షంలో ప్రస్తుత పోటీ వాతావరణంలో అందరికీ తెలిసేలా కొత్త నోటిఫికేషన్ విడుదల చేసి స్టాఫ్‌నర్సు పోస్టులను రిక్రూట్‌మెంట్ చేయాల్సి ఉందనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి విధానాలను ఉద్దేశపూర్వకంగా విస్మరించి ఇడబ్ల్యుఎస్ వర్తించని ఎపి శాక్స్ నోటిఫికేషన్ దరఖాస్తుల ఆధారంగా రిక్రూట్‌మెంట్ చేయడం ఏమిటనే విమర్శలు వ్యక్తమవు తున్నాయి. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ వివరాలు ప్రకటించని కారణంగా తాము ఉద్యోగావకాశాన్ని కోల్పోయామని పలువురు వాపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. అత్యవసర ప్రాతిపదికన స్టాఫ్‌నర్సు పోస్టులను రిక్రూట్‌మెంట్ చేయాల్సి వస్తే యుపిహెచ్‌సి పాత రోస్టర్ మెరిట్ జాబితా ఆధారంగా రిక్రూట్‌మెంట్ చేయాల్సి ఉందని, గుర్తుతెలియని మీడియా మాధ్యమంలో నోటిఫికేషన్ విడుదల చేసి గుట్టు చప్పుడు గాకుండా ఎపిశాక్స్ నోటిఫికేషన్ దరఖాస్తుల ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన అర్బన్ సెంటర్స్ స్టాఫ్‌నర్సులను ఎంపిక చేయ డంలోని మతలబేమిటో తేల్చాలని, వివాదాస్పద రిక్రూట్‌మెంట్ కమిటీ సభ్యులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై డిఎంహెచ్ఒను వివరణ కోరడానికి ప్రయత్నించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

బాధితులకు సత్వర న్యాయం : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

ట్రాసిటీ కేసులలో బాధిత వ్యక్తులకు సత్వర న్యాయం అందించడమే ఎస్సీ, ఎస్టీ చట్టం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని, చట్టం కింద నమోదైన కేసులను వేగంగా విచారించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ గిరీష అన్నారు. సోమవారం కల్లెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన ఎస్సీ,ఎస్టీ (అట్రాసిటీల నిరోధక) చట్టం 1989 అమలుపై జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభంలో గత సమావేశంలో లేవనెత్తిన కేసులపై తీసుకున్న చర్యల గురించి కలెక్టర్ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. గత సమావేశంలో చర్చించిన 25 కేసుల్లో 2 తప్పుడు కేసులని, మిగిలిన అన్ని కేసుల్లో పరిహారం అందజేసినట్లు రాయచోటి ఆర్‌డిఒ కలెక్టర్‌కు వివరించారు. కేసు నంబరు 75/2022పై సబ్ డివిజనల్ పోలీసు అధికారి (ఎస్‌సి సెల్-1) మాటాడుతూ హైకోర్టులో స్టే ఉందని, ఇతర కేసులు పూర్తయ్యాయని కలెక్టర్‌కు వివరించారు. సబ్ డివిజనల్ పోలీసు అధికారి (ఎస్ సి సెల్ - 2), సబ్ డివిజనల్ పోలీసు అధికారి, రాజంపేట, రాయచోటి, మదనపల్లె తమ పరిధిలోని కేసులను పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఈ ఏడాది జూలై నుండి నవంబర్ వరకు మొత్తం 20 కేసులు నమోదయ్యాయని జిల్లా పోలీసు అధికారులు కలెక్టర్‌కు తెలియజేశారు. వీటిలో 5 తప్పుడు కేసులుగా గుర్తించామని, సంబంధిత పోలీసు అధికారులు తెలిపారు.ఇతర కేసుల్లో విచారణ కొనసాగుతోందని వారు తెలిపారు. మదనపల్లె డివిజన్, రాయచోటి డివిజన్, రాజంపేట డివిజన్ల డిఎస్‌పిలు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద నమోదైన కేసుల వివరాలను కలెక్టర్‌కు తెలియజేశారు. కేసుల విచారణ త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. కోడూరు ఎమ్మెల్యే కొరుముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ కేసుల సంఖ్య బాగా తగ్గిందన్నారు. ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్ దాఖలు, పరిహారం అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులను ఆయన కోరారు. జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ సరైన కేసుల్లో చార్జిషీట్ దాఖలు చేసే ప్రక్రియను పోలీసు అధికారులు వేగవంతం చేయాలని సూచించారు. కేసుల్లో దోషులకు తగిన శిక్ష పడాలన్నారు. రాజంపేట ఎంఎల్ఎ మేడా మల్లిఖార్జునరెడ్డి మాట్లాడుతూ ఎలాంటి పొంతన లేకుండా పెట్టిన కేసులను తగిన పరిశీలన అనంతరం ఎత్తివేసే ప్రక్రియ జరగాలన్నారు. వ్యక్తిగత కారణాలతో కొన్ని కేసులు పెడుతున్నారని, ఇలాంటి కేసులను తగ్గించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మదనపల్లె, తంబళ్లపల్లె ఎమ్మెల్యేలు ద్వారకనాథరెడ్డి, నవాజ్ బాషా మాట్లాడుతూ ఎక్కువ శాతం ఎస్సీ,ఎస్టీ కేసులు భూ సమస్యలేనని చెప్పారు. మదనపల్లిలో జరిగిన కొన్ని కేసుల గురించి ఆయన చర్చించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టిందని కమిటీ సభ్యులు కొందరు కలెక్టర్‌కు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం బాధిత వ్యక్తులకు సత్వర న్యాయం అందించడమేనని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టం అభియోగాలను ఎదుర్కొంటున్న ఏ ఉద్యోగిపైనైనా సస్పెన్షన్‌ను ఉపసంహరించుకునే హక్కు కలెక్టర్‌కు మాత్రమే ఉందని, సస్పెన్షన్‌ను ఉపసంహరించుకునే హక్కు సంబంధిత హెచ్ఒడికి లేదని ఆయన జిల్లాకు చెందిన అన్ని శాఖల అధిపతులకు సూచించారు. ప్రస్తుత సమావేశంలో చర్చించిన కేసులపై తీసుకున్న చర్యల నివేదికను వచ్చే సమావేశానికి కమిటీ సభ్యులు అందజేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, కమిటీ సభ్యులు, పోలీసు అధికారులు, మదనపల్లె, రాజంపేట, రాయచోటి ఆర్‌డిఒలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'జిల్లా కేంద్రాన్ని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేస్తాం'

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా కేంద్రాన్ని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యేలు గడిగోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, మేడా మల్లికార్జున్‌రెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, నవాజ్‌బాష, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండపల్లెలో కల్యాణ మండప నిర్మాణ పనుల భూమిపూజ చేశారు. ముఖ్య అతిథులకు మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రం ఏర్పాటు, నియోజకవర్గ అభివృద్ధిలో సిఎం జగన్ మోహన్‌రెడ్డి సహకారాన్ని మరువలేమన్నారు. అదే స్థాయిలో నియోజకవర్గ ప్రజలు ప్రజా ప్రతినిధులు తోడుగా నిలిచి అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారంటూ అభినందించారు. క్రమంలోనే యండపల్లి గ్రామ పరిధిలోని శ్రీ భైరవేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రజల భాగస్వామ్యంతో ఎంతో ఉపకరమైన కళ్యాణ మండపం, పార్కు ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం సంతోషదాయకమన్నారు. పోలుసుబ్బారెడ్డి విద్యార్థి దశ నుంచి ఒక కమిట్‌మెంట్‌తో పనిచేస్తారన్నారు. గ్రామస్తులను ఒక తాటిపైకి తీసుకువచ్చి భారీ స్థాయిలో కల్యాణ మండపం పార్కు ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేయడం అర్షించదగ్గ విషయమన్నారు. ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి పది మంది మేలుకోరే వ్యక్తి నాయకుడిగా నిలుస్తాడని పోలు సుబ్బారెడ్డిని అభినందించారు. జిల్లా కేంద్రం సమీపంలోని పూర్తిస్థాయి వాహనాల పార్కింగ్ అహ్లాదకరమైన పార్కులు వివాహాది ఇతర శుభకార్యాల నిర్వహణకు కల్యాణ మండపం ఏర్పాటుపై కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ భయ్యారెడ్డి, డాక్టర్ నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష, వైసిపి నాయకులు బసిరెడ్డి సిద్ధారెడ్డి, బుడ్డా ధర్మారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు



పీలేరులోని బోదేషావలి దర్గా

29 నుంచి బోదేషావలీ ఉరుసు

ప్రజాశక్తి-పీలేరు

పట్టణంలోని హజరత్ బోదేషావలీ దర్గాలో గంధం, ఉరుసు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దర్గా ముజావర్ రెడ్డి బోదేషా తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులకు గంధం, ఉరుసు నిర్వహణ వివరాలు తెలియజేశారు. 29వ తేదీ గురువారం రాత్రి స్థానిక సదుం రోడ్డులోని సుభాన్ సాహెబ్, దిలిగిర్ సాహెబ్ మనవళ్ల కుటుంబం నుంచి గంధం ఊరేగింపుగా దర్గాకు తీసుకు వస్తారని పేర్కొన్నారు. 30వ తేదీ శుక్రవారం రాత్రి దర్గాలో ఉరుసు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. హిందూ ముస్లిం సోదరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని అందరినీ ఆహ్వానించారు.

50 వసంతాల సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - రాయచోటి

గుంటూరులో ఈనెల 24న ఎన్‌జిఒ కల్యాణ నిర్వహించే పౌర హక్కుల సంఘం మహాసభను జయప్రదం చేయాలని పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి రాయచోటి రవిశంకర్, ఉపాధ్యక్షుడు రెడ్డయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక అంబేద్కర్ ఫెక్సీ వద్ద పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం పౌర ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ ప్రస్థానంలో సంస్థ 49 సంవత్సరాలు పూర్తి చేసుకుని 50వ సంవత్సరంలోకి వెళుతున్న సందర్భంగా మహాసభ నిర్వహించనున్నామని చెప్పారు. సభకు ప్రజలు ప్రజాస్వామికవాసులు ప్రజా సంఘాలు హాజరుకావాలిన్నారు. అగ్రవర్ణాలకు చెందినవారు నిమ్నజాతులపై చేస్తున్న దాడులపై, మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలపై నిజనిర్ధారణ చేస్తూ బాధితుల పక్షాన మాట్లాడుతున్నామని చెప్పారు.కార్యక్రమంలో ఆర్. రవిశంకర్ కార్యదర్శి, యం రవిశంకర్ సహాయ కార్యదర్శి,పి రెడ్డయ్య జిల్లా ఉపాధ్యక్షులు డి.నగముని ఎపి బీసీ అడ్వకేట్ అసోసియేషన్, రమణ న్యాయవాది సతీష్ పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి : చైర్‌పర్సన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రతి ఒక్కరి సమస్యను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజా, కమిషనర్ ప్రమీల పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వారు వినతిపత్రాలను స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కార నిమిత్తం ఆదేశాలు జారీ చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘంలోని అన్ని శాఖాల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

మైనార్టీ విద్యార్థుల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షత

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మైనార్టీ విద్యార్థుల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షత మానుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సర్వేపల్లి నరసింహ డిమాండ్ చేశారు. సోమవారం జూనియర్ కళాశాల ఎదుట ఫ్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్, మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్‌లను కొనసాగించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యారంగంలో సమూల మార్పులు చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులను చదువుకు దూరం చేసే విధంగా వారి ఫాసిస్టు ధోరణులు విద్యా వ్యవస్థపై అడుగడుగునా రుద్దుతున్నారని పేర్కొన్నారు. ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఉన్న ఫ్రీ మెట్రిక్స్ స్కాలర్షిప్‌లను ఎంఫిల్, పిహెచ్‌డి చేసే విద్యార్థులకు మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్‌లను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం చాలా దుర్మార్గమైనదన్నారు. మైనారిటీలు విద్యలో వెనుకబాటుకు గురవుతున్నారని, చదువుకునే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందని తెలిపారు. 2006 సంవత్సరంలో సచార్ కమిటీ నివేదిక ప్రకారం 2009లో మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్‌ను ప్రవేశ పెట్టారన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ శాస్త్రీయ విద్యను అటకెక్కించే విధంగా కాషాయీకరణను విద్యార్థుల వైపు రుద్దుతూ విద్యావ్యవస్థలు మార్పులు చేస్తోందని తెలిపారు. ఈ నెల 8న కేంద్ర మైనారిటీ శాఖ మంత్రి స్మృతి ఇరానీ పార్లమెంటు సాక్షిగా సెక్యులర్ దేశమని, విద్యార్థులంతా సమానమని మేకవన్నెపులి మాటలు చెబుతూ మైనారిటీ విద్యార్థుల స్కాలర్షిప్లు రద్దు చేస్తున్నామని చెప్పడం విడ్డూరమని విమర్శించారు. ఈ విధంగా పాలకవర్గాలు విద్యా వ్యవస్థలో తగిన నిధులు కేటాయించకుండా విద్యార్థులంతా సమానం అని చెబుతూ ఎంఫిల్, పిహెచ్‌డి చేసే విద్యార్థులు మొదలుకొని కింది స్థాయిలో ఎలిమెంటరీ స్కూల్లో చదువుకునే విద్యార్థుల వరకు మైనారిటీలకు స్కాలర్షిప్లు రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం సరైనది కాదని తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి విద్యా వ్యవస్థ పట్ల చిత్తశుద్ధి ఉంటే నెట్, సెట్, జె ఆర్ ఎఫ్ లతోపాటు విద్యార్థులకు వచ్చే వివిధ రకాల ఫెలోసిపుల శాతాన్ని పెంచి రీసెర్చ్ కేంద్రాలను యూజీసీ ద్వారా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం ఎంఎఎన్ఎఫ్ తిరిగి కొనసాగించాలన్నారు. లేకపోతే దేశవ్యాప్తంగా పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పక్కాగా పరిశీలించాలి

జిల్లా ఎన్నికల పరిశీలకులు ప్రద్యుమ్న



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు ప్రద్యుమ్న

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో నిర్వహిస్తున్న 2023 ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితాలో నమోదైన ఈపి, జెండర్ రేషియోలను పక్కాగా పరిశీలించాలని ఏపీ మార్కెఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్, జిల్లా ఎన్నికల పరిశీలకులు ప్రద్యుమ్న ఆర్డీఓలను, తహశీల్దార్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ కలిసి ఓటర్ల జాబితాకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాబితా రూపకల్పనకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ ఎన్నికల పరిశీలకులకు వివరించారు. జిల్లాలో మొత్తం 13,47,044 ఓటర్లు ఉన్నారని ఎలక్టోరల్ పాపులేషన్ రేషియో 698గా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్‌కు సంబంధించి ఆగస్టు ఒకటి నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు 34,927 విజ్ఞప్తులు అందగా 20977 అంగీకరించామని, 8260 విజ్ఞప్తులను తిరస్కరించామని తెలిపారు. ఇప్పటివరకు ఫారం-6లో 23396 దరఖాస్తులు రాగా, 15287 అంగీకరించామని,4503 తిరస్కరించినట్లు తెలిపారు. ఫారం7కు సంబంధించి 3848 దరఖాస్తులలో 2280 అంగీకరించగా 174 తిరస్కరించారని, ఫారం 8లో 6860 దరఖాస్తులకు 3725 అంగీకరించగా 2695 తిరస్కరించినట్లు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల పరిశీలకులు ప్రద్యుమ్న పియస్ మాట్లాడుతూ తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేసేందుకు రాజకీయ పార్టీలు పూర్తిగా సహకరించాలన్నారు. క్లైమ్స్ అండ్ అబ్జెక్షన్స్ దరఖాస్తులను పెండింగ్ లేకుండా తగు పరిశీలన చేసి పరిష్కరించాలన్నారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్ల పై అభ్యంతరాలు ఉంటే అధికారులకు తెలపాలన్నారు. ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఒకే రకమైన రెండు ఫొటోలు, డూప్లికేట్ ఓటర్లను పక్కాగా తొలగించాలని, ఈ విషయంలో ఆర్‌డిఒలు, తహశీల్దార్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 18-19 వయసులో ఉన్న యువత కొత్త ఓటర్లుగా నమోదు అయ్యేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అన్ని రాజకీయ పార్టీలకు నాయకులకు ఓటర్ లిస్టు అందజేయాలన్నారు. ఫామ్ 6 తక్కువగా వస్తున్నాయని, నియోజకవర్గాల వారీగా జిల్లాలో అర్హులైన ఓటర్లు వందశాతం నమోదు కావాలని ఇందుకు సంబంధించి ఓటర్ల చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని, అలాగే గ్రామాలలో దండోరా వేయించాలని, ప్రెస్ మీట్ లు ఏర్పాటు చేసి ఓటర్ల నమోదు పెరిగేందుకు కృషి చేయాలన్నారు. జనవరి మొదటి వారంలో మళ్లీ జిల్లాలో పర్యటించడం జరుగుతుందని ఎన్నికల పరిశీలకులు తెలిపారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు పేర్కొన్న అంశాలకు సంబంధించి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసి తమీమ్ అన్సారీయా, డిఆర్ఓ సత్యనారాయణ, రాయచోటి, రాజంపేట, మదనపల్లె ఆర్డీవోలు రంగస్వామి, కోదండరామిరెడ్డి, మురళి, తహశీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



డాక్టరేట్ పట్టాతో శంకర నాయుడు

శంకర నాయుడుకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

వివిధ రకాల సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు పట్టణానికి చెందిన కంచర్ల శంకర నాయుడుకి ప్రసిద్ధిగాంచిన ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. సోమవారం బెంగళూరు నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రముఖుల చేతుల మీదుగా శంకర నాయుడు డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చేసిన సమాజ సేవలను గుర్తించి తనకు డాక్టరేట్‌తో గౌరవించడం ఆనందంగా ఉందన్నారు. ఈ డాక్టరేట్ తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో సమాజ సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పూరి రమేష్ మాట్లాడుతూ అనునిత్యం ప్రజా సేవాకార్యక్రమాలకు పునరంకితమవుతూ, సమాజ శ్రేయస్సుకు పాటుపడుతున్న కంచర్ల శంకర నాయుడుకి ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్ అందజేయడం శుభ పరిణామమన్నారు. ఇదే స్ఫూర్తితో ఆయన సమాజ సేవా కార్యక్రమాలపై మరింత దృష్టి సారించి, మరిన్ని అవార్డులు, డాక్టరేట్లను సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. డాక్టరేట్ అందుకున్న శంకర నాయుడికి మార్పూరి రమేష్ ఆయన మిత్ర బృందం శుభాకాంక్షలు తెలియజేశారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పురుషోత్తమ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రక్తదానం యొక్క ప్రాధాన్యతను, గొప్పతనమును తెలుసుకోవాలని సూచించారు. రక్తదానం చేస్తే ఎంతో మంది ప్రాణాలను కాపాడిన వారవుతారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు రక్తదానం చేసి తమ స్ఫూర్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో రిమ్స్ బ్లడ్ బ్యాంక్, రాజంపేట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం సౌజన్యంతో నిర్వహించారు. ఇందులో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ కె.చంద్రకళ, ఐసిటిసి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. కార్యక్రమానికి ఎన్‌సిసి ఆఫీసర్ మేజర్ విజయ్ భాస్కర్ పర్యవేక్షణలో విద్యార్థులు సహకారం అందించారు. కార్యక్రమంలో పలువురు కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు


యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు కస్తూర్బా విద్యార్థులు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల చెందిన ఐదుగురు విద్యార్థినిలు రాష్ట్ర స్థాయి యోగా క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఎస్ఓ పుష్పలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన జిల్లాస్థాయిలో క్రీడా యోగా పోటీలలో తమ పాఠశాల విద్యార్థినిలు విజయం సాధించి రాష్ట్ర స్థాయి యోగా క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన అశ్విని, శ్వేత, నాగలక్ష్మి, నవనీత, తేజలు త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి యోగా క్రీడ పోటీలలో పాల్గొంటారని స్పష్టం చేశారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినిలను పిఇటి రమీజాన్, ఎస్ఓ పుష్పలతలు అభినందించారు.

శతాధిక వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-కలికిరి


నల్లగుసుల తిమ్మయ్య (ఫైల్ ఫొటో)

శతాధిక వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బంధువుల వివరాల మేరకు మండలంలోని గుట్టపాలెం పంచాయతీ ఆచార్ల గొల్లపల్లికి చెందిన నల్లగుసుల తిమ్మయ్య (కలిమి తిమ్మయ్య) సోమవారం అనారోగ్యంతో మరణించారు. ఈయన వయసు 116 సంవత్సరాలు. 1906వ సంవత్సరంలో జన్మించాడు. 100 సంవత్సరాల వయసు దాటినప్పటికీ ప్రతి రోజూ మూడు కిలోమీటర్ల మేర ఊతకర్ర సహాయంతో కాలినడకన వెళ్లి తిరిగి ఇంటికి చేరుకునే వాడు. చూపు కొంచెం మందగించినప్పటికీ, చెవులు వినికిడి తగ్గినప్పటికీ శరీరకంగా ఆరోగ్యంగా ఉండటం, ఆయన ఆహారపు అలవాట్లు, నడవడిక చూసి నేటి యువకులు కూడా ఔరా అనిపించే రకంగా ఉండేవాడు. తిమ్మయ్యకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురితో పాటు 8మంది మనవళ్లు, నలుగురు ముని మనవరాళు ఉన్నారు. నాలుగు తరాలకు వారధిగా నిలిచిన తిమ్మయ్య మరణం వారి కుటుంబంలో విషాదం నింపింది. గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు.

రైస్ మిల్లును ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే


రైస్ మిల్లును ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని కసిరెడ్డి గారిపల్లె పంచాయతీ మేదరపల్లిలో సోమవారం ఆ గ్రామానికి చెందిన చింతం వెంకటరెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన రైస్ మిల్లును సోమవారం మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సేవలందించాలన్నారు. చుట్టు ప్రక్కల గ్రామాల రైతులు పండించిన వరిపంటను మిషన్ కోసం దూర ప్రాంతాలకు వెళ్ళకుండా తమ గ్రామంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ రెడ్డి, ఇండియన్ గ్యాస్ అధినేత వెంకట సుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి గ్రామనాయకులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న పోలీస్‌స్టేషన్

ప్రజాశక్తి - పుల్లంపేట

మండలపరిధిలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్‌పి విష్ణువర్ధన్ రాజు రాక కోసం ముస్తాబవుతోంది. వివరాల్లోకెళితే అధికారులు వస్తే మాత్రం పోలీస్ స్టేషన్ ముస్తాబవడం, అధికారులు ఎవరూ రాకపోతే యథాస్థితిగా ఉండడం, చెదులు పట్టినప్పటికీ పట్టించుకోకుండా ఉండడం జరుగుతుందా అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎస్‌పి వస్తుండటంతో పోలీసులు పరిశుభ్రత, పచ్చదనం, గోడలకు సున్నం వంటి హుటాహుటిన చేస్తున్నారు.

విద్యుత్ పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి-పెద్దమండ్యం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విద్యుత్ పొదుపు వారోత్సవాలలో భాగంగా మండలంలోని స్థానిక గ్రామంలో ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీలో భాగంగా ఇంచార్జి ప్రిన్సిపల్ రాజు మాట్లాడుతూ భావితరాలకు విద్యుత్ ఆదా చేయాలని, అనవసరంగా విద్యుత్తు వృధా చేయకూడదని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు, పిల్లలు పాల్గొన్నారు.

బిజెపి ప్రభుత్వమే ప్రధాన దోషి

ప్రజాశక్తి-బి.కొత్తకోట


మహా దీక్షలో ఎంఎస్‌పి నాయకులు

ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ చట్టబద్దతకు తాము అనుకూలం మంటూనే ఎనిమిదేళ్లయినా పార్లమెంటులో బిల్లు పెట్టకుండా మోసం చేస్తున్న బిజెపినే మాదిగల ప్రధాన దోషి అని మహాజన సోషలిస్ట్ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.నరేంద్ర బాబు మాదిగ విమర్శించారు. పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎంఎస్‌పి జాతీయ అధ్యక్షులు మందకృష్ణమాదిగ పిలుపు మేరకు సోమవారం స్థానిక జ్యోతి బస్టాండు ఆవరణలో మహాదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బిజెపి ఇచ్చిన హామీని నిలబెట్టుకొనే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ముఖ్యమంత్రి జగన్, ప్రతి పక్ష పార్టీ నాయకుడు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, సిపిఐ, సిపిఎం పార్టీల నాయ కులు ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి నియోజకవర్గ ఇంచార్జీ దుమ్ముచిన్న, భవానీ వెంకటేష్, మాజీ జెడ్‌పిటిసి ఈశ్వర్, ఎంజెఎఫ్ జిల్లా నాయకులు ప్రతాప్, తిరుపాల్, చౌడప్ప, పులికల్లు చంద్ర, మల్లెల రవి, కృష్ణప్ప, బాలు, రమణ, వై.రామప్ప, గణపతి, వెంకటప్ప, సంకరరాజా, లక్ష్మి నారాయణ, శివ, గంగలప్ప నరసింహులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉరితాడును ముద్దాడిన యోధులు

ప్రజాశక్తి - బి.కొత్తకోట


రక్తదానం చేస్తున్న సభ్యులు

భరతమాత ముద్దుబిడ్డలు, స్వాతంత్ర్య సంగ్రామంలో మొట్టమొదటిసారిగా ఉరికంబం ఎక్కిన భారత దేశ అమర వీరులు అష్ఫాకుల్లా ఖాన్, రాం ప్రసాద్ బిస్మిల్ 95 వర్ధంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అల్ ఏ హెసాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జ్యోతిబస్టాండ్‌లో అష్ఫాఖుల్లాఖాన్,రాంప్రసాద్ బిస్మిల్,రాజేంద్రనాథ్ లహరి,ఠాగూర్ రోషన్ సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభ్యులు 24 మంది రక్తదానం, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.హుస్సేన్ ఖాన్,సిపిఐ సీనియర్ నాయకులు ఎస్.జబీర్ ఖాన్,ఎస్.మనోహర్ రెడ్డిలు మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ లోని షాజహాన్ పూర్ లో 1900 సంవత్సరం అక్టోబర్ 22వ తేదీన పెద్ద జమీందారీ కుటుంబంలో జన్మించిన అష్ఫాఖుల్లా ఖాన్ చిన్నప్పటి దశ నుండే దేశభక్తి ,జాతీయభావాలు అలవర్చుకొన్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖ వైద్యులు వి.వి రెడ్డి, యువ నాయకులు నక్కా మహేష్, మైనార్టీ నాయకులు అయాబ్ ఖాన్, ఎం.ఎస్.నాసిర్, ఎం.డిమస్తాన్, కె.కాలేషా, మొహద్దిన్ సాబ్, ఫరూక్, యం.డి,యం.డిఆఫ్రీజ్, యం.డిఅఫ్రీద్, యం.డి. షాహీద్, మన్సూర్, నిమ్మనపల్లి క్రిష్ణారెడ్డి, కమ్యూనిష్టు నాయకులు ఎస్.సలీంభాష, యమ్.అష్రఫ్‌అల్లి, రఘు, సమీవుల్లా, టిడిపి నాయకులు నారాయణస్వామి రెడ్డి, కుడుం శ్రీనివాసులు, తుపాకుల సుకుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి : టిడిపి


గుర్రంకొండ : ఇదేంఖర్మ కార్యక్రమంలో నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, నాయకులు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

వైసిపి ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని మార్కెట్‌కమిటీ మాజీచైర్మన్ కాలాడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని, రామాలయంవీధి, లాలావీధిలో ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. టిడిపి ప్రభుత్వం తోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలవు తాయని అన్నారు.కార్యక్రమంలో టిడిపి నాయకులు సర్పంచ్ చంద్రాయుడు, డాక్టర్‌సెల్ ప్రధాన కార్యదర్శి షఫీనాయక్, రాఘవేంద్ర, ధర్మారెడ్డి, మన్సూర్, రవీంద్ర, ముక్తార్ దిలీప్ రాజు ,రవి రెడ్డి పాల్గొన్నారు. **గుర్రంకొండ :** వైసిపి అసమర్ధపాలనతో ప్రజలు విసుగు చెందారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని బలిజగడ్డ, తాలింవీధి, సంఘసముద్రం పంచాయతీలలో సోమవారం టిడిపి మండల పార్టీఅధ్యక్షుడు నాయినిజగదీష్, మాజీసర్పంచ్ నౌషాద్ అహ్మద్ ఆధ్వర్యంలో ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. వైసిపి అధికారం చేపట్టినప్పటి నుండి రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య, అడ్డగోలుగా నిత్యవసర ధరలు పెరిగాయని అన్నారు. వైసిపి ప్రభుత్వం పతనం అయ్యే రోజు దగ్గర్లోనే ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మాజీ వైస్ ఎంపిపి, ఎంపిటిసి ప్రసాద్ మాజీ ఎంపి టిసి జాజ్‌అహ్మద్, మాజీ సర్పంచ్ ప్రదీప్, సుంకం శేఖర, మేకల చలపతి, ఎల్లుట్ల మురళి, రామయ్య ,చలమారెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు. **కలకడ :** సోమవారం మండలంలోని బాట వారిపల్లి, బాలయ్యగారిపల్లి, కలకడ పంచాయతీలలో ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారని ఘాటుగా విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు మల్లారపు రవిప్రకాష్ నాయుడు, మండలపార్టీ అధ్యక్షులు ప్రభాకర్ నాయుడు, సర్పంచ్ విశ్వ నాథనాయుడు, మాజీ ఎంపిటిసి ఈశ్వరయ్య, దగ్గుబాటి వెంక టేశ్వర రావు, శ్రీనివాసులురెడ్డి, బి.మహబూబ్ బాషా, కాంతా రావు, చంద్ర మోహన్ ,శేఖర్ నాయుడు, త్యాగరాజు, వెంకట రమణ, బివిస్వామి అబ్దుల్ సుకూర్, వై.జిలానిభాష పాల్గొన్నారు. **రాయచోటి :** జగన్‌రెడ్డి అరాచక పాలనకు చరమగీతం పాడే రాబోయే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందామని మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని 4, 5వ వార్డు కువైట్ వీధిలో టిడిపి ఆధ్వర్యంలో మన రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాష , టిడిపి పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్ వలీ,రాయచోటి మండల శాఖ అధ్యక్షులు మురికినాటి వెంకట సుబ్బారెడ్డి,ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ ఎస్.కె హుస్సేన్, పట్టణ మైనార్టీ అధ్యక్షులు అతావుల్లా, టిడిపి నాయకులు మైనుద్దీన్, మన్సూర్, జావిద్, జాబీర్, సత్యారెడ్డి, రామక్రిష్ణ గౌడ్ ,రాజారెడ్డి మాబుఅలీ, ప్రతాప్, సోనిరాజ్ కలీమ్, సర్పంచ్ జిలాన్,రెహ్మాన్, ఇలియాజ్, మహమ్మద్ జాఫర్, జాబిద్, అభుజార్, ఇమాఉల్లా, బడుగు వాసుదేవుడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అర్జీలను పరిశీలిస్తున్న జెసి తమీమ్ అన్సారీయా

స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు : జెసి

ప్రజాశక్తి - రాయచోటి

స్పందన ఆర్జీలను నిర్లక్ష్యం చేయకుండా గడువు లోపల పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణ, ల్యాండ్ అండ్ సర్వే ఏడి జయరాజ్, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరి ంచారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమానికి వస్తుంటారన్నారు. అధికారులు బాధితుల సమస్యలు గుర్తించి వెంటనే వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అర్జీదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులకు అర్థమయ్యే విధంగా పరిష్కార నివేదిక పంపాలన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను శనివారం లోపల క్లియర్ అయ్యేటట్లు చూడాలన్నారు. అర్జీలను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి బాధితులు సంతృప్తిచెందేలా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఇంకా కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలకు రక్షణ కరువు : ఆర్ఆర్

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలో ప్రజల మానప్రాణాలకు వైసీపీ ప్రభుత్వంలో రక్షణ లేకుండా పోయిందని, దానికి నిదర్శనం మాచర్ల ఘటనేనని మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాచర్లలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ముందుగా నిర్ణయించిన ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సమయంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కిశోర్ ఆధ్వర్యంలో వందలాదిమంది పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రౌడీ మూక టిడిపి నేత బ్రహ్మ రెడ్డి , టిడిపి కార్యకర్తలపై దాడి చేయడం శోచనీయమని వాపోయారు. ఇరుగ్రూపులను అరెస్టు చేయకుండా కేవలం టిడిపి నాయకులను మాత్రమే అరెస్టు చేయడం దారుణమని తెలిపారు. వైసిపి మూకలు మారణాయుధాలతో విరుచుకుపడి బ్రహ్మారెడ్డిని హతమార్చేందుకు ప్రయత్నించారన్నారు. పోలీసుల సమక్షంలోనే తెలుగుదేశం పార్టీ కార్యాలయంతోపాటు బ్రహ్మారెడ్డి ఇంటిని పెట్రోలుపోసి తగులబెట్టారున్నారు. సమావేశంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, పట్టణ అధ్యక్షులు ఖాదరవల్లి, పార్లమెంటరీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు అభుజర్ రూరల్ అధ్యక్షులు మురికినాటి వెంకట సుబ్బారెడ్డి, సర్పంచ్ వాసు, రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి హరి, అమర్‌నాధరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షులు అతావుల్లా పాల్గొన్నారు

21న మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా ఎంఎల్ఎ శ్రీకాంత్ రెడ్డి పిలుపుమేరకు వైఎస్ఆర్ సిపి నాయకులు బేపారి మహమ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న రాయచోటి ఏరియా ఆసుపత్రి ఆవరణంలో మెగా రక్తదాన శిబిరాన్ని భారీ ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలోని దీప బ్లడ్ బ్యాంకు, ఏరియా ఆసుపత్రి వైద్యులు, బ్లడ్ బ్యాంకు అధికారులు, సిబ్బంది సహకారంతో రక్తదాన శిబిర ఏర్పాటుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకూ : ' చింతల'

ప్రజాశక్తి-కలికిరి

ప్రజా సమస్యల పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి అన్నారు. సోమవారం మేజర్ పంచాయతీలోని రెడ్డివారిపల్లి, సంత గేటు, చిన్న మాలపల్లి, సీనయ్య కాలనీలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వమిచ్చే సంక్షేమ పథకాలు గురించి వారికి వివరించారు. సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ప్రజలు వీధిలైట్లు వెలగలేదని, డ్రైనేజ్‌కాలువలు క్లీన్ చేయడం లేదని, కొత్తగా డ్రైనేజ్ కాలవలు నిర్మించాలని ఆయనకు విన్నవించారు. ఎమ్మెల్యే పంచాయతీ సిబ్బందిని పిలిపించి చిన్నమాలపల్లి వీధిలైట్లు వేయించారు. ఇక్కడ ఉన్న సమస్యలు రెండు రోజుల్లో పరిష్కరించే విధంగా చూస్తామని వారికి హామీనిచ్చారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు తన దృష్టికి తీసుకవస్తే వెంటనే పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పేదలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్య క్రమంలో జడ్‌పిటిసి పద్మజా, యోగవర్ధన్, ఎంపిపి నూర్జహాన్, ఎంపిడిఒ గంగయ్య, ఇఒ ఉదయ్ కుమార్, తహశీల్దార్ భాగ్యలత, ఎంఇఒ రంగనాథరెడ్డి, ఎస్ఐ లోకేష్ రెడ్డి, ప్రభుత్వ అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ఇటీవల జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బి.కొత్తకోట శాసనసభ్యులు ద్వారకనాథ్ రెడ్డి జయశ్రీకాలనీ ఎక్స్టెన్షన్, కరెంట్ కాలనీలలో పర్యటించినప్పుడు అక్కడి ప్రజలు పట్టణానికి ఈ వీధులు చివరగా ఉండటంతో ఇక్కడ అన్నిరకాల విష సర్పాలు సంచరిస్తుంటాయని, ఇక్కడ విద్యుత్ స్తంభాలతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించాలని ప్రజా ప్రతినిధులు, అధికారులను ఆదేశించారు. జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ ఎంపిపి ఖలీల్ అహ్మద్ చొరవతో కాలనీలలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ఎఇ గిరిధర్‌కు సూచించగా వెంటనే విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. సమస్యల సత్వరమే పరిష్కరించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కృత్రిమ అవయవాలకు14 మంది ఎంపిక

ప్రజాశక్తి- పుల్లంపేట

మండల పరిధిలోని 14 మంది కృత్రిమ అవయవాలకు ఎంపికైనట్లు అధ్యక్షుడు మల్లు సుబ్బనర్సారెడ్డి తెలిపారు. ఒమేగా రెహాబ్ ఫెడరేషన్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎంపికైన వారిలో ఎం.కొండమ్మ, మల్లేశ్వర్, ఎం.శివయ్య ధాన్య సాగర్, గంగాధర్, రాజమ్మ, చిన్న, రాజయ్య, నాగరాజు, నారాయణ, లక్ష్మీ ప్రసాద్, చంగల్ రాజు, దుర్గయ్య , నారాయణరెడ్డి, రామయ్య ఎంపికయ్యారు. ఈనెల 22వ తేదీన ఆర్టిఫిషియల్ లిమ్స్ 14 మందికి కృత్రిమ అవయవాలు పంపిణీ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని అవయవాలను తీసుకోవాలని సూచించారు.

చిరుధాన్యాలతో స్వయం ఉపాధి

ప్రజాశక్తి-కలికిరి

కృషి విజ్ఞాన కేంద్రం కలికిరి నందు చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్ప త్తులు తయారీ పై ఐదు రోజులు 14 నుంచి 19వ తేది వరకు వృత్తి శిక్షణ కార్య క్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామీణ మరియు పట్టణ మహిళలు పాల్గొని చిరుధాన్యాలైన రాగి, సజ్జ, జొన్న,కొర్రలతో, మిక్చర్,మురుకులు, బిస్కెట్లు వంటి విలువ ఆధారిత ఉత్పత్తులుపై వాటి ప్యాకింగ్, లేయరింగ్ వంటి అంశా లపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కృషివిజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు ఎ.శ్రీని వాసులు, కె.మాధురి, వై.పీరుసాహెబ్, కె.నవీన పాల్గొన్నారు.

మినీ అంగన్వాడీ కేంద్రం ప్రారంభం


ప్రజాశక్తి-కలకడ

మినీ అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ ప్రారం భించారు. మండలంలోని కలకడ సచివాలయం పరిధిలో ఉన్న ఇందిరమ్మ కాలనీలో సోమవారం మినీ అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మండలంలోని నడిమిచెర్ల పంచాయతీ పరిధిలో ఉన్న వడ్డిపల్లెలో గతంలో ఉన్న మినీ అంగన్వాడీ కేంద్రంలో పిల్లలు లేని కారణంగా గతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దృష్టికి తీసుక వచ్చారు. ఎమ్మెల్యే చొరవతో కలకడకు మార్చినట్లు ఆమె తెలిపారు. చిన్న పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రానికి తీసుక రావాలని సూచిం చారు. పిల్లలకు అందించే పౌష్టికాహారం తీసుకొని పిల్లలు శారీరకంగా దృఢత్వం కలిగేలా చేయాలని చెప్పారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ మాట్లాడుతూ కేంద్రంలోనే గర్భవతులు అంగన్వాడీ కేంద్రంలోనే భోజనం చేయాలని, ప్రభుత్వం అందిస్తున్న వైఎస్ఆర్ కిట్లను సద్వినియోపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికు మార్, ఎంపిడిఒ సిహెచ్ నారాయణ, కోన సర్పంచ్ జిల్లా రాజగోపాల్ రెడ్డి, తహ శీల్దార్ రాము, ఐసిడిఎస్ సూపర్వైజర్,సింగిల్ విండో చైర్మన్ కమలాకర్‌రెడ్డి, సెక్రటరీ నందిని, ప్రకాష్‌రెడ్డి, ఆర్ఐకమలాకర్, జయ ప్రకాష్, ఇనాయతుళ్ళ, వాలంటీర్స్, పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేధింపులే హత్యకు దారితీశాయి : సిఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్


వివరాలు వెల్లడిస్తున్న సిఐ నరసింహారావు

గత శుక్రవారం మైదుకూరుకు చెందిన అంకాల్‌రెడ్డి హత్య కేసుకు సంబంధించి వేధింపులే హత్యకు దారి తీశాయని అర్బన్ సీఐ నరసింహారావు తెలియజేశారు. సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమా వేశంలో సిఐ నరసింహారావు మాట్లా డుతూ మైదుకూరుకు చెందిన అంకాల్ రెడ్డి గత పది సంవత్సరాలుగా రాణమ్మ అనే మహిళతో సహజీవనం చేస్తూ ఉండే వాడని తెలిపారు. శుక్రవారం అటవీ శాఖ కార్యాలయం వద్ద అంకాల్ రెడ్డి పై పెట్రోల్ పోసి హత్య చేసిన ఘటనలో అనుమానితురాలిగా ఉన్న రాణమ్మను సోమవారం గుం డ్లూరు శివాలయం వద్ద అరెస్టు చేసి అదుపులోకి తీసుకోవడం జరిగిందని, విచారణ చేయగా తానే ఈ హత్యకు పాల్పడినట్లు అంగీకరించిందని తెలిపారు. ప్రతిరోజు డబ్బులు కోసం వేధించేవాడని, అక్రమ సంబంధాలు అంటగట్టి వేధింపులకు గురి చేస్తుండడంతో భరించలేక ఈ హత్యకు పాల్పడినట్లు రాణమ్మ అంగీకరించిందని పేర్కొన్నారు. నిందితురాలిని రిమాండ్ విధించి కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు నిందితులు అరెస్టు : డిఎస్‌పి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని కస్తూర్బా పాఠశాల ఎదురుగా ఉన్న గంగాపురం లక్ష్మిదేవికి చెందిన మామిడి చెట్లను నరికిన కేసులో నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు ఎస్‌సి, ఎస్‌టి డిఎస్‌పి సుధాకర్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 5వ తేదీన రాత్రి బలరాం, దేవర ఇంటి సాంబశివయ్య, బొమ్మల చంద్ర, షేక్ మహమ్మద్ అబ్బాస్, షేక్ మీసారి ఐదు మంది కలిసి ట్రాక్టర్ సహాయంతో 90 రాతికుసాలు, 80 మామిడి చెట్లను నరికేశారని లక్ష్మిదేవి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు సోమవారము నలుగురు బైరాగి గుట్ట వద్ద ట్రాక్టర్లో వెళుతుండగా అరెస్టు చేశామని, ఒకరు పరారైనట్లు తెలిపారు. గతంలో ఆ భూమిని మేడ విజయశేఖర్‌రెడ్డి, రాయవరంరఫిక్, తిరుమలరెడ్డి, శేఖర్‌రెడ్డి గతనెల కిందట అనుభవంలో ఉన్న భూమిని మాకు ఇవ్వమని లక్ష్మిదేవిని అడి గారని, అందుకు ఆమె అంగీకరించ కపోవడంతో కులంపేరుతో దూషించారని ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో రాయ చోటి రూరల్ సిఐ లింగప్ప, ఎస్ఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌సి,ఎస్‌టి డిఎస్‌పి సుధాకర్

మహారాజరాజశ్రీ రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.NO. 256/2022

గురిగింజకుంట వెంకటసుబ్బమ్మ, W/o నామునిస్వామి, వయస్సు సం॥ 55, R/o, Door No.5/116-10 డెడ్‌లాక్, మస్క్యా స్ట్రీట్, చెన్నముక్కపల్లి గ్రా॥, రాయచోటి మం॥, అన్నమయ్య జిల్లా. ...వాది

Vs

సయ్యద్ చాన్‌బాష, S/o సత్తార్‌సాబ్ Door No.5/265-5, సాయిబాబానగర్, రాజులకాలనీ, చెన్నముక్కపల్లి గ్రా॥, రాయచోటి మం॥, అన్నమయ్య జిల్లా. ...ప్రతివాది

దావా సమను

వాది ప్రతివాది అయిన మీపై Specific Performance పై కోర్టులో దావా దాఖలు చేసి వున్నారు. పై దావా 26-12-2022వ తేది వాయిదా వున్నది. కావున మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల పై కోర్టులో పై తేదీన ఉ॥ 10.30 లకు మీరు స్వయముగా కానీ వకీలు ద్వారా గానీ హాజరు అయి మనవి చేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

//By Order of the Court//
కె. ఈశ్వరయ్య, M.Com., B.L.,
టి.వి.రమణ, B.A., B.L.,
పిటిషనర్ తరపున న్యాయవాదులు, రాయచోటి.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE OF PILER

O.S.No. 109 OF 2018

Sri P.Ramakrishna Reddy and another. ...Plaintiffs

Vs

Smt Mure Saval Reddy Rani. ...Defendant

SUIT SUMMONS TO DEFENDANT

To,
Smt Mure Saval Reddy Rani w/o Narem ANIL Kumar, residing at Kothapalli Village, H/o. Tatguntapalli, Murevandlapalli Post and Valmikipuram Mandal, Annamayya District.

whereas the above-named plaintiffs have filed the above suit for recovery of amount due under the suit register mortgage deed against you and the same is stands posted for your appearance on 06-01-2023. Please take suit summons and appear before the above said Hon'ble court on 06-01-2023 at 10-30 A.M, either in person or through an Advocate and file your objections, failing which matter will be heard and decided on merits in your absence.

//By order of the court//
M.R.VENKATA RAMANA REDDY, B, Sc., LL.B.,
Advocate & Notary,
Counsel for Plaintiffs, Piler.

మహారాజశ్రీ రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S. No: 128/2021

బండారు పెద్ద సుబ్బరాయుడు తండ్రి లేట్ వెంకట సుబ్బయ్య, మన్నూర్ గ్రామం మరియు పోస్ట్, రాజంపేట టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా. ...వాది

వర్సెస్

మంచా సుబ్బయ్య తండ్రి నరసింహులు, ఇంటి నెంబర్ 5/146, కె.సి సముద్రం గ్రామం, కొండూరు పోస్ట్, పెనగలూరు మండలం, అన్నమయ్య జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి సమను

పై తెలిపిన వాది, ప్రతివాది అయిన మీ పై ప్రోనోటు బాకీ వసూలు నిమిత్తం పై కోర్టులో దావా దాఖలు చేసివున్నారు. సదరు కేసు 23.12.2022 న వాయిదా వున్నది. కావున మీరు స్వయంగా కానీ లేదా న్యాయవాది ద్వారా గాని, పై తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్ట్ లో హాజరై, జవాబు దాఖలు చేసుకోవలెను. అట్లు తప్పిన యెడల, మీ నుండి ఎలాంటి జవాబు లేదని భావించి, మీ పరోక్షమందు కేసు తీర్మానించబడును.

//బై ఆర్డర్ అఫ్ ది కోర్ట్//
ఎస్. కృష్ణ కుమార్,
ఎస్. గిరీష్ కుమార్,
న్యాయవాదులు, రాజంపేట.

మహారాజశ్రీ నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

I.A. No 224/2020 in O.S. No : 42/2020

1.రాజబోయిన సుబ్బయ్య died his LRs
2.రాజబోయిన పెంచలయ్య తండ్రి లేట్ సుబ్బయ్య మరియు 4గురు ఇతరులు, కోమంతరాజపురం గ్రామం, బెస్తపల్లి పోస్ట్, పెనగలూరు మండలం ,అన్నమయ్య జిల్లా. ...పిటిషనర్స్/వాదులు.

వర్సెస్

1. యర్రతోటి పిచ్చయ్య తండ్రి లేట్ సుబ్బయ్య
2.యర్రతోటి హరి తండ్రి నరసింహులు కోమంతరాజపురం గ్రామం, బెస్తపల్లి పోస్ట్, పెనగలూరు మండలం ,అన్నమయ్య జిల్లా. ...రెస్పాండెంట్స్/ ప్రతివాదులు

నోటీస్

పై కనిన పిటిషనర్స్, రెస్పాండెంట్స్ పై దావా దాఖలు చేసి యున్నారు. మరియు I.A.No. 224/2020 మధ్యంతర ఉత్తర్వులు కొరకు పిటీషన్ వేసి వాదుల పై intirim orders పొంది ఉన్నారు.సదరు విషయమై ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల 04.01.2023 వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కనిన కోర్టులో స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై మనవి చేసుకోగలరు. లేనంతట పరోక్ష మున తీర్మానించదబడునని ఖండితంగా తెలియజేయడమైనది.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//
బి. మోహన్ బాబు
పిటీషన్ పరం అడ్వకేట్, రాజంపేట.

మహారాజశ్రీ నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S. No : 42/2020

1.రాజబోయిన సుబ్బయ్య died his LRs
2.రాజబోయిన పెంచలయ్య తండ్రి లేట్ సుబ్బయ్య మరియు 4గురు ఇతరులు, కోమంతరాజపురం గ్రామం, బెస్తపల్లి పోస్ట్,పెనగలూరు మండలం,అన్నమయ్య జిల్లా. ...వాదులు

వర్సెస్

1. యర్రతోటి పిచ్చయ్య తండ్రి లేట్ సుబ్బయ్య
2.యర్రతోటి హరి తండ్రి నరసింహులు కోమంతరాజపురం గ్రామం, బెస్తపల్లి పోస్ట్, పెనగలూరు మండలం, అన్నమయ్య జిల్లా. ...ప్రతివాదులు

సమను

పై కనిన వాదులు, ప్రతి వాదుల పై పర్మినెంట్ ఇంజెంక్షన్ కోరుతూ దావా దాఖలు చేసియున్నారు.సదరు విషయమై ప్రతివాదులకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల 04.01.2023 వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కనిన కోర్టులో స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై మనవి చేసుకోగలరు. లేనంతట పరొక్షమున తీర్మానించదబడునని ఖండితంగా తెలియజేయడమైనది.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//
బి. మోహన్ బాబు
వాదులపరం అడ్వకేట్
రాజంపేట.